దిష్టిబొమ్మల్లా..!

భూములు రీసర్వే పూర్తి చేసి హద్దుల్లో నాటడానికి ఉద్దేశించిన వైఎస్ఆర్ జగనన్న భూరక్ష-2020 పథకం సర్వే రాళ్లు ఎక్కడ పడితే అక్కడ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మైన్స్ అధికారుల ఒత్తిడి మేరకు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు వ్యయప్రయాసలకోర్చి వీటిని తయారు చేశారు. వారికి డబ్బులు ఇవ్వకపోగా, వీటిని వినియోగించకపోవడంతో అటు గ్రానైట్ ఫ్యాక్టరీలలో, ఇటు రీసర్వే గ్రామాల్లో కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అధికారుల ఒత్తిడి, లక్ష్యం మేరకు నాటాలని ముందుకెళ్లినా రైతులు ఏమాత్రం అంగీకరించడం లేదు. కొన్నిచోట్ల రీసర్వేను వ్యతిరేకిస్తూ నాటిన రాళ్లను కూడా పెరికేసినట్లు చెబుతున్నారు. కానీ అన్నిచోట్లా రాళ్లు నాటేసినట్లు డబ్బులు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



కోళ్లబైలులో రోడ్డు పక్కన వృథాగా ఉన్న సర్వే రాళ్లు



వలసపల్లె గ్రానైట్ ఫ్యాక్టరీలో గుట్టగా ఉన్న రీసర్వే రాళ్లు

- వృథాగా భూ రీసర్వే రాళ్లు
- గ్రానైట్ ఫ్యాక్టరీల్లో, గ్రామాల్లో గుట్టలు
- వైఎస్ఆర్ జగనన్న భూరక్షకు స్వస్తి
- స్టోన్ ప్లాంటేషన్ నిధులు స్వాహా

మదనపల్లె, జూన్ 27: వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పథకం వివిధ కారణాలతో ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా మారింది. సర్వే సక్రమంగా జరకపోవడం, శాస్త్రీయత లేకపోవడం, రైతుల అభ్యంతరాలు, తదితర కారణాలుగా చెబుతున్నారు. రీసర్వే రాళ్ల వల్ల ఎవరికీ ఎటువంటి ప్రయోజనం లేకపోయినా ప్రభుత్వ ఒత్తిడి మేరకు మైన్స్ అధికారులు రాళ్లను సిద్ధం చేయాలని గ్రానైట్ ఫ్యాక్టరీలకు, ఇటు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, రైతుల పొలాల్లో హద్దుల్లో నాటాలని సర్వే అధికారులకు టార్గెట్ పెట్టారు. వీటిని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా నాటగా, మరికొన్ని చోట్ల రైతుల అభ్యంతరాలతో ఆపేశారు. మరోవైపు వైసీపీ ఘోర పరాజయానికి కారణమైన ఎన్నికల ముందు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ఎన్‌డీఏ ప్రభుత్వం రద్దు చేసింది. రీసర్వేకు అనుబంధంగా తీసుకొచ్చిన ఈ చట్టం రద్దు కావడంతో ఇక భూముల రీసర్వేపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఆ రాళ్లను ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకం-2020 అమలులోకి తెచ్చింది. బ్రిటీష్ కాలం నాటి సర్వేను కాదని, వందేళ్ల తర్వాత భూముల రీసర్వేను తెర మీదకు తెచ్చింది. ఇందులో భాగంగా నాలుగు విడతల్లో మండలాలు, గ్రామాల వారీగా రీసర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో రీసర్వే కోసం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మొదటి, రెండో విడతలు పూర్తి చేసి మూడో విడతలో సగం ప్రక్రియ పూర్తిగా చేపట్టారు. తర్వాత ఎన్నికల ప్రక్రియ రావడంతో రీసర్వేకు బ్రేక్ పడింది. ఇలా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో 32 రెవెన్యూ గ్రామాల చొప్పున 64 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టారు. ఇక్కడ కూడా మొదటి, రెండో విడతలు పూర్తి చేసినా..మూడో విడతలో అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల రాళ్లు సిద్ధం చేశారు. వీటిలో లక్షకుపైగా క్షేత్రస్థాయికి చేర్చగా, సగం రాళ్లు గ్రానైట్ ఫ్యాక్టరీల వద్దనే ఉండిపోయాయి. క్షేత్రస్థాయికి చేరిన రాళ్లలో కూడా సగానికిపైగా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని కొందరు స్థానికంగా నిర్మాణాలకు, ఇతర అవసరాలకు తీసుకెళ్తున్నారు.

రీసర్వే రాళ్లను గనులు, భూగర్భశాఖ అధికారులు స్థానికంగా ఉన్న క్వారీ, గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులకు లక్ష్యం నిర్ణయించారు. క్వారీ యజమానులు గ్రానైట్ దిమ్మె ఇస్తే ఫ్యాక్టరీలలో వాటిని రాళ్లు తయారు చేయడంతో పాటు వాటిపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష-2020 పేరుతో రైటింగ్ రాసి, వాటిని క్షేత్రస్థాయికి చేర్చి రెవెన్యూ అధికారులకు అప్పగించే బాధ్యతలు తీసుకున్నారు. ఇందుకోసం క్వారీ దిమ్మె నుంచి క్షేత్రస్థాయిలో భూమిలో వాటిని నాటడం వరకూ ప్రభుత్వం కేటగిరీల వారీగా సొమ్ములు చెల్లిస్తోంది. అంతవరకూ బాగానే ఉంది. మూడేళ్ల పాటు జరిగిన రీసర్వే ఎలా జరిగింది? దానివల్ల రైతులకు ఫలితం ఎంత అనే అంశాన్ని పక్కన పెడితే..మూడు విడతల్లో రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో ఎన్ని రాళ్లు నాటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. మూడో విడత రీసర్వే ముగింపు దశకు చేరుకోగానే, సార్వత్రిక ఎన్నికల రాకతో రీ సర్వే ప్రక్రియకు బ్రేక్ పడింది. తిరిగీ కొనసాగుతుందా? అంటే ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మంగా తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్లిపోయింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో రీసర్వేపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీనికి అనుబంధంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు కావడంతో రీసర్వే కూడా రద్దయినట్లేనని అధికారులు భావిస్తున్నారు. అయితే వీటిని తయారు చేసిన గ్రానైట్ ఫ్యాక్టరీలలో జగనన్న రాళ్లు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. గనులు, భూగర్భశాఖ అధికారులు తమకు లక్ష్యాలు నిర్ణయించి, వాటిని తయారు చేయలేమన్నా..ఒత్తిడి తెచ్చి చేయించారని, ప్రస్తుతం వాటిని ఏం చేసేదని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు వాపోతున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారికి, వైసీపీ మద్దతుదారులుగా ఉన్న వ్యాపారులకు రాళ్లను తయారు చేసే బాధ్యత నుంచి తప్పించినట్లు కూడా చెబుతున్నారు. అయితే తయారు చేసిన వాటిని తీసుకెళ్లకపోగా, ఫ్యాక్టరీల వద్ద దిష్టిబొమ్మలా జగన్ రీసర్వే రాళ్లు దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో ఎక్కువగా క్వారీలు, గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో 400కు పైగా గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఫ్యాక్టరీకి వెయ్యి నుంచి రెండు వేల రాళ్ల చొప్పున తయారు చేసి ప్రభుత్వానికి ఇవ్వాలని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు టార్గెట్ విధించారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలం వలసపల్లెలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 22 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండగా, అక్కడ పది నుంచి 20 వేల రాళ్లు సిద్ధం చేయాలని హుకుం జారీ చేశారు. ప్రభుత్వ పథకం కావడంతో అంగీకరించి ప్రతి ఒక్కరూ వీటిని తయారు చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.270 ఇస్తుండగా, దానిపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష-2020 పేరు రాయించడానికి ఫ్యాక్టరీ యాజమానులు మరో రూ.100 వెచ్చించినట్లు చెబుతున్నారు. రాయి తయారీకి మొత్తం రూ.400 ఖర్చు కాగా అందులో ప్రభుత్వం రూ.270 ఇస్తున్నట్లు చెబుతున్నారు.

ఇక కుప్పం, చిత్తూరు, ప్రకాశం జిల్లా ఒంగోలు ఏరియాల నుంచి తయారైన రాళ్లు క్షేత్రస్థాయిలో చేర్చడానికి రూ.350 కాగా, దానిని భూమిలో నాటడానికి రూ.150 కలిపి మొత్తం రూ.500 ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కొన్నింటిని తీసుకెళ్లగా, ఎక్కువ రాళ్లను తీసుకెళ్లకుండా అలానే వదిలేశారు. మొదట్లో కొన్ని ఫ్యాక్టరీలో తీసుకెళ్లినా..క్షేత్రస్థాయిలో రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో నాటారా? అంటే అదీనూ లేదు. అక్కడ కూడా గ్రామ సమీపంలోని పొలాలు, రహదారుల పక్కన పడేశారు. రైతుల భూముల హద్దుల్లో అది కూడా వివాదం లేని చోట మాత్రమే అక్కడో రాయి నాటారు. ప్రభుత్వ భూముల గుర్తింపులోనూ ఇదే పరిస్థితి. రైతుల నుంచి అభ్యంతరం లేని ప్రభుత్వ భూములు, రహదారుల పక్కన అక్కడక్కడా ఒక్కొక్కటి నాటారు. ఎక్కువగా అటు గ్రానైట్ ఫ్యాక్టరీలోనూ, ఇటు క్షేత్రస్థాయిలోనూ సర్వే రాళ్లు గుట్టలుగా పడి ఉన్నాయి. తమకు టార్గెట్లు పెట్టి మరీ రాళ్లు తయారు చేయించారని, తమ పని వదులుకుని రాళ్లు తయారు చేస్తే సకాలంలో తీసుకెళ్లలేదని, ఇస్తామన్న డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని మదనపల్లెతో పాటు కుప్పం, చిత్తూరు గ్రానైట్ వ్యాపారులు వాపోతున్నారు. వీటిని కాదని, ఒంగోలు నుంచి కూడా రాళ్లు తెప్పించి మదనపల్లె డివిజన్‌లో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో లోడుల కొద్దీ దింపేశారు.

ప్లాంటేషన్ సొమ్ములు స్వాహా..!

మదనపల్లె మండలంలోని కాశీరావుపేట, తేనెటీగలపల్లె, పామయ్యగారిపల్లె, మొలకలదిన్నె, వేంపల్లె, పొన్నేటిపాళెం, పప్పిరెడ్డిపల్లె, చిప్పిలి, బసినికొండ, కోళ్లబైలు, వెంకప్పకోట, తదితర గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇక్కడ సరిహద్దు రాళ్లు నాటడానికి మదనపల్లె, కుప్పం, చిత్తూరు, ఒంగోలు ప్రాంతాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఫ్యాక్టరీ యాజమానులే రాళ్లను లారీలు, టిప్పర్లతో క్షేత్రస్థాయికి తరలించారు. అక్కడ రెవెన్యూ గ్రామం అవసరాన్ని బట్టి అక్కడక్కడా దింపారు. అయితే వీటిని పూర్తిస్థాయిలో నాటలేదు. గ్రామాల్లో ఎక్కడా రీసర్వే సవ్యంగా, సక్రమంగా, పూర్తి స్థాయిలో జరగకపోవడంతో క్షేత్రస్థాయిలో సరిహద్దులో వీటిని నాటడానికి అటు రెవెన్యూ, ఇటు సర్వే అధికారులు సాహసం చేయలేదు. అధికారుల ఒత్తిడి, లక్ష్యం మేరకు నాటాలని ముందుకెళ్లినా..రైతులు ఏమాత్రం అంగీకరించడం లేదు. రీసర్వేను వ్యతిరేకిస్తూ, నాటిన రాళ్లను కూడా పెరికేసినట్లు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ భూములను గుర్తిస్తూ నాటాలన్నా..ఎక్కడా రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములైన చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఆ విస్తీర్ణం మేరకు లేవు. నాలుగువైపులా రైతుల ఆధీనంలోనూ, సాగులోనే ఉన్నాయి. అక్కడ రాళ్లు నాటాలన్నా..ఎంజాయ్‌మెంట్‌లో ఉన్న భూమిలో రాళ్లు ఎలా నాటుతారనే అభ్యంతరాలు చుట్టుముట్టాయి. ఇలా మొత్తమ్మీద డివిజన్‌లో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో రాళ్లు నాటలేదు. కానీ అన్ని చోట్లా రాళ్లు నాటేసినట్లు డబ్బులు స్వాహా చేసినట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఒక్కో రాయి నాటడానికి ప్రభుత్వం రూ.150 మంజూరు చేసింది. జిల్లా సర్వే అధికారుల నుంచి తహసీల్దార్ల ఖాతాకు రాగా, అక్కడి నుంచి మండల సర్వేయర్లకు ఈ డబ్బులు వచ్చినట్లు చెబుతున్నారు.



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిరుపయోగంగా ఉన్న రీసర్వే రాళ్లు

ఇంకా అధికారం ఉందనుకుని..

- వాహనాలపై నామినేటెడ్ స్టిక్కర్లతో తిరుగుతున్న వైసీపీ నాయకులు

రైల్వేకోడూరు (రూరల్), జూన్ 27: మత్తు వదలరా.. అధికారం మత్తు వదలరా అనే పాట ప్రస్తుతం ఉన్న మాజీ వైసీపీ నాయకులకు వర్తిస్తుంది. ఎందుకంటే అధికారం కోల్పోయినా కూడా వారు నడిపే వాహనాలకు ఇంకా ప్రభుత్వ నామినేటెడ్ స్టిక్కర్లతో దర్శనం ఇస్తున్నారు. గురువారం మండలంలోని మాధవరంపోడు పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తన వాహనానికి ప్రభుత్వ విప్ స్టిక్కర్‌తో దర్శనం ఇచ్చారు. వైసీపీ నాయకులు నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా తమ సొంత వాహనాలలో ప్రభుత్వ నామినేటెడ్ స్టిక్కర్లతో యథేచ్ఛగా తిరుగుతున్నారు. మరీ ముఖ్యంగా అధికారం ఉన్నప్పుడు ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ స్టిక్కర్లు తమ వెంట ఉండే ముఖ్య కార్యకర్తలకు బిస్కెట్లు పంచినట్లు పంచిపెట్టారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు తమ వాహనాలకు స్టిక్కర్లతో ఐదు సంవత్సరాలు హల్‌చల్ చేశారు. నామినేటెడ్ స్టిక్కర్లు ప్రజాప్రతినిధులకు పరిమితి మేరకే కేటాయిస్తారు కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మితిమీరి అడిగిన ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ స్టిక్కర్లను కేటాయించారు. నియోజకవర్గంలో ఎవరికి పడితే వారు తమ వాహనాలకు ఎమ్మెల్యే స్టిక్కర్లతో విచ్చలవిడిగా తిరిగేశారు. అధికారం కోల్పోయినా ఇప్పుడు కూడా కొంతమంది వైసీపీ నాయకులు తమ వాహనాలకు నామినేటెడ్ స్టిక్కర్లతో తిరుగుతున్నారు. ప్రజా తీర్పును గౌరవించి వైసీపీ నాయకులు తమ వాహనాలకు నామినేటెడ్ స్టిక్కర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ విప్ స్టిక్కర్ ఉన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వాహనం

పటిష్టంగా సంపూర్ణత అభియాన్

- లక్కిరెడ్డిపల్లె, కోడూరు, కురబలకోట మండలాల్లో అమలుకు శ్రీకారం
- అధికారులతో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 27: కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ ఆదేశాల మేరకు జూలై 4న జిల్లాలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమం అమలు, సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ, డీఆర్డీఏ, ప్రణాళిక అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ ద్వారా చేపట్టిన అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాలో రైల్వేకోడూరు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లె మండలాలు ఎంపికైనట్లు తెలిపారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమం కింద నీతి అయోగ్ ఎంపిక చేసిన ఆరు ఇండికేటర్స్‌లకు సంబంధించి నూరుశాతం పురోగతి సాధించడానికి జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వెనుకబడిన జిల్లాను ఆయా ఇండికేటర్ల అమలు ద్వారా అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. కార్యక్రమం పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అలాగే క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సంబంధిత జిల్లా అధికారులు, మూడు మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పెన్షన్ల పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యువో ఏవో లక్ష్మిపతి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. జూలై 1వ తేదీ ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా 50 హౌస్‌హోల్డ్‌ల మ్యాపింగ్ చేపట్టాల్సి ఉందని, శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్మెంట్ తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండి కార్యక్రమం పూర్తి చేయాలన్నారు.

తగ్గుతున్న టమోటా ధరలు

మదనపల్లె టౌన్, జూన్ 27: ఉన్నపళంగా ధరలు పెరిగి టమోటా రైతులను సంతోషింపజేసే టమోటా మార్కెట్లు ఉన్నటుండి ధరలు పడిపోతూ అదే రైతులను ఏడిపిస్తున్నాయి. గత శుక్రవారం వరకు మదనపల్లె టమోటా మార్కెట్‌లో గరిష్ఠంగా టమోటా కిలో ధర రూ.88 పలికి రైతులను సంతోషపెట్టింది. ఈ క్రమంలో కేవలం ఐదు రోజుల్లోనే ఈ టమోటా ధరలు కిలోకు రూ.34 తగ్గిపోయి రైతులను ఉస్సురోమనిపిస్తున్నాయి. మదనపల్లె మార్కెట్ యార్డుకు ఈనెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు నిత్యం 500 టన్నుల నుంచి 650 టన్నుల వరకు టమోటా విక్రయానికి వచ్చేది. ఈ క్రమంలో ఈనెల ఒకటో తేదీ టమోటా గరిష్ఠంగా కిలో రూ.44 పలికింది. రానురాను టమోటా ధరలు నిత్యం పెరుగుతూ వచ్చాయి. ఉత్తర భారతదేశంలో టమోటా పంట సీజన్ ముగియడంతో అక్కడి వ్యాపారులు మదనపల్లె మార్కెట్ వైపు దృష్టి సారించారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి టమోటా ధరలు పెరిగాయి. గత శుక్రవారం నాణ్యమైన టమోటా గరిష్ఠంగా కిలో రూ.88 పలుకగా, రెండో రకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.54 పలికింది.

చల్లబడిన వాతావరణం.. పెరుగుతున్న దిగుబడి

పది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని చల్లని వాతావరణం నెలకొంది. ఈ వాతావరణంలో టమోటా పంట దిగుబడి పెరుగుతోంది. ఇదే వాతావరణం కొనసాగితే ఎకరాకు అన్ని కోతలు కలిపి 1000 క్రేట్లు (క్రేట్ 25 కిలోలు) రావచ్చునని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే మదనపల్లె మార్కెట్‌కు నిత్యం 1000 నుంచి 1500 టన్నుల టమోటా విక్రయానికి వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఆదివారం నుంచి మదనపల్లె మార్కెట్‌కు ఈ ప్రాంత రైతులే కాకుండా అనంతపురం జిల్లా కదిరి, తనకల్లు, ముదిగుబ్బ ప్రాంతాల నుంచి రైతులు టమోటాను విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా మార్కెట్‌కు నిత్యం 900 టన్నుల టమోటా విక్రయానికి వస్తోంది. ఏకంగా రోజుకు 300 టన్నులు అదనంగా టమోటా విక్రయానికి వస్తుండటంతో వ్యాపారుల మధ్య పోటీ తగ్గింది. దీంతో టమోటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ప్రతిరోజూ కిలోకు రూ.10 చొప్పున టమోటా ధరలు తగ్గిపోయి గురువారానికి మొదటి రకం టమోటా గరిష్ఠంగా కిలో రూ.54, రెండో రకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.33కు పడిపోయింది. దీంతో మదనపల్లె ప్రాంత రైతులు లబోదిబోమంటున్నారు.



సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ లక్ష్యం

- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, జూన్ 27: ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన రాయచోటి ఆర్టీసీ బస్టాండులో రాయచోటి నుంచి తిరుపతికి నూతన సూపర్ లగ్జరీ బస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని ప్రయాణికుల కోసం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి పట్టణాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాయచోటి డిపో నుంచి తిరుపతికి సూపర్ లగ్జరీ సర్వీసులు ప్రారంభించడం ఇదే మొదటిసారన్నారు. అనంతరం మంత్రి రాయచోటి బస్టాండును సందర్శించి ఆర్టీసీ ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన రవాణా అధికారి రాము, రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ, టీడీపీ నేతలు, కార్యకర్తలు, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాపై అపోహలు వద్దు

అన్నమయ్య జిల్లా తరలిపోతుందని సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై అపోహలు వద్దని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఒక మహనీయుడి పేరుతో ఏర్పాటైన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోనే ఉంటుందని ఎక్కడికీ పోదని చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయి నప్పటికీ ఆ బాధను భరించలేక కొంతమంది సోషల్ మీడియా వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రం ఇక్కడే ఉంటుందని ఎక్కడికీ పోదని, దానికోసం తాను ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబునాయుడు రాయచోటికి వచ్చినపుడు జిల్లా కేంద్రం ఎక్కడికీ పోదని ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలన్నారు. రాయచోటి పట్టణాన్ని అత్యంత సుందరంగా తయారు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.



రాయచోటి నుంచి తిరుపతికి నూతన బస్ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఆస్తి కోసం హతమార్చారు

- తల్లిదండ్రులను హత్య చేసిన కొడుకు, కోడలు
- వృద్ధ దంపతులతో బలవంతంగా ముష్టిచెక్క తినిపించారు
- కొత్తవడ్డెపల్లెలో విషాదం

వీరబల్లి, జూన్ 27: అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకే.. కోడలితో కలిసి ఆ వృద్ధ తల్లిదండ్రుల పాలిట కాలయముడయ్యాడు. చిన్నప్పుడు గుండెల మీద తన్నితే ఎంతో ఆనందంగా భావించిన వారు.. చివరకు ఆస్తి కోసం ఆ గుండెలనే ఆగిపోయేలా చేస్తారని ఎన్నడూ ఊహించి ఉండరు. తమకున్న ఆస్తిని పెద్దకుమారుడి పిల్లలకు సగం రాయిస్తామని చెప్పినందుకు కన్న తల్లిదండ్రులైన వృద్ధ దంపతులను ముష్టిచెక్క, బెల్లం నూరి వారికి తినిపించి హత్య చేసిన దారుణ సంఘటన మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్తవడ్డెపల్లెలో గురువారం జరిగింది. బంధువులు, స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తవడ్డెపల్లెకు చెందిన ఉప్పుతోళ్ల చిన్నసుబ్బన్న (75), ఉప్పుతోళ్ల నాగమ్మ (70)లకు ఇద్దరు కుమారులుండగా పెద్దకుమారుడు సాంబశివయ్య, భార్య మంజుల అనారోగ్యంతో ఇద్దరూ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వారికి ఇరువురు కూతుళ్లు వీరనాగమ్మ, జ్యోతిలు ఉండగా వారిద్దరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. వృద్ధ దంపతులు ప్రస్తుతం చిన్నకుమారుడు ఉప్పుతోళ్ల రమణయ్య, అతడి భార్య కళావతిలతో కలిసి ఉంటున్నారు. వారికి పిల్లలు లేరు. చిన్నకుమారుడు బేల్దారి పనిచేస్తున్నాడు. కాగా చిన్నసుబ్బన్నకు పదెకరాల భూమి ఉండగా అందులో నాలుగు ఎకరాల్లో మామిడి తోట ఉంది. మిగిలిన ఆరు ఎకరాల్లో వరి, వేరుశనగ పండిస్తుంటారు. తనకున్న ఆస్తి 10 ఎకరాల్లో సగం రాసి పెద్దకుమారుడి కూతుర్ల పేరుతో రాయిస్తానని తల్లిదండ్రులు చిన్నకుమారుడితో చెబుతుండేవారు. దీంతో వారి మధ్య తరచూ ఆస్తి విషయమై గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆ ఆస్తిని వారిని రాసిస్తాడేమోనన్న ఆగ్రహంతో చిన్నకుమారుడు రమణయ్య, అతడి భార్య కళావతిలు కలిసి గురువారం ఉదయం ముష్టిచెక్క, బెల్లంనూరి వారికి బలవంతంగా తినిపించారు. అది తిన్న వృద్ధ దంపతులు ప్రాణాపాయ స్థితిలో ఉండగా బంధువులు గమనించి 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా తమకు ముష్టిచెక్క, బెల్లం నూరి తమ కుమారుడు, కోడలే బలవంతంగా తమతో తినిపించారని, తాము చనిపోతే దానికి కారణం వారిద్దరేనని ఆస్పత్రిలో ఉప్పుతోళ్ల చిన్నసుబ్బన్న పోలీసులకు తెలిపాడు. చికిత్స పొందుతూ ముందుగా నాగమ్మ మృతి చెందగా అనంతరం చిన్నసుబ్బన్న కూడా మృతి చెందాడు. ఇరువురు ఒకేసారి మృతి చెందడంతో వారి బంధువులు, స్థానికులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. వృద్ధుల మృతికి కారకులైన రమణయ్య, కళావతిలను శిక్షించాలని కోరారు. ఈ విషయమై సీఐ తులసీరాం, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



మృతి చెందిన భార్యాభర్తలు చిన్నసుబ్బన్న, నాగమ్మ

వైసీపీకి కలికిరి జడ్పీటీసీ పద్మజ రాజీనామా

కలికిరి, జూన్ 27: కలికిరి జడ్పీటీసీ సభ్యురాలు కాకర్ల పద్మజ వైసీపీకి రాజీనామా చేశారు. గురువారం ఆమె మీడియాకు ఈ మేరకు ఒక వీడియోతో పాటు రాజీనామా లేఖను అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. వైసీపీ అధిష్టానికి ఈ మేరకు రాజీనామా లేఖ పంపారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కలికిరి జడ్పీటీసీ పదవి బీసీ మహిళకు కేటాయించారు. వైసీపీ తరపున ఆ ఎన్నికల్లో పోటీ చేసిన పద్మజ జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మూడేళ్ల తరువాత ఆకస్మికంగా ఆమె పార్టీకి గుడ్‌బై చెప్పడంతో వైసీపీ వర్గాలు ఖంగుతిన్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసీపీ దారుణంగా పరాజయం చెందిన తరువాత జిల్లాలో ఒక మండల స్థాయి పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేయడం కూడా ఇదే మొదటిదిగా చెబుతున్నారు. కాగా పద్మజ భర్త డాక్టర్ లోకవర్ధన్ ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోనూ, అంతకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు కీలక పదవుల్లో కొనసాగారు. ప్రస్తుతం జిల్లా వైద్య శాఖలో ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. తాజాగా కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వివాదాలను అధిగమించేందుకు జడ్పీటీసీగా ఉన్న ఆయన భార్య పద్మజను వైసీపీకి రాజీనామా చేయించారని చెబుతున్నారు.



రాజీనామా లేఖతో పద్మజ

కలుషిత ఆహారం తినొద్దు

- వాల్మీకిపురంలో పర్యటించిన వైద్య బృందం

వాల్మీకిపురం, జూన్ 27: కలుషిత ఆహారం తీసుకోవడం, ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన నీటిని తాగడం ద్వారా వ్యాధులు ప్రబలుతాయని వాల్మీకిపురం గ్రామ పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్ తెలిపారు. వాల్మీకిపురం పట్టణ పరిసరాలలో డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన డయేరియాతో అస్వస్థత అన్న కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. వాల్మీకిపురం పరిసర ప్రాంతాలలో ఇంటింటా వైద్యాధికారులు, సిబ్బంది సర్వే చేపట్టి వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్సలు, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏసీసీ పరిశ్రమ నిర్మాణం జరిగేనా..?

- రెండు దశాబ్దాలకు పైగా ఎదురు చూపులు
- కొత్త ప్రభుత్వంపై బాధిత రైతుల ఆశలు

వాళ్లంతా ఒకప్పుడు తమ పంటపొలాలను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరి భూముల్లో సిమెంటు పరిశ్రమ నిర్మించేందుకు ఓ ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఆ రైతులు కూడా తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో భూములను సిమెంటు పరిశ్రమకు ఇచ్చేందుకు అంగీకరించారు. అప్పట్లో సిమెంటు పరిశ్రమ యాజమాన్యం ఒక్కో ఎకరా రూ.50వేలతో కొనుగోలు చేసింది. ఆ తర్వాత పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా.. భూములను మాత్రం రైతుల నుంచి కొను గోలు చేస్తూ వచ్చింది. ఇప్పటికి దాదాపు 28 ఏళ్లు దాటినా పరిశ్రమ ఏర్పాటు కాలేదు. భూములిచ్చిన వారికి ఉద్యోగాలు రాలేదు. పంట పొలాలు మాత్రం బీడువారాయి. ఇక ఎప్పటికి సిమెంటు పరిశ్రమ నెలకొల్పుతారో తెలియని పరిస్థితి. ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పరిశ్రమ నిర్మిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మైలవరం, జూన్ 27: మండల పరిధిలోని గొల్లపల్లె, వద్దిరాల పరిసర ప్రాంతాల్లో నాణ్యత గల సిమెంటురాయి ఉన్నట్లు తేలడంతో 1996 సంవత్సరంలో అసోసియేట్ సిమెంటు పరిశ్రమ (ఏసీసీ) నిర్మాణానికి యాజమాన్యం ముందుకు వచ్చింది. ఇందుకోసం వద్దిరాల, గొల్లపల్లె, జీ.ఉప్పలపాడు, చిన్నవెంతుర్ల, బెస్త వేముల, బి.జంగాపల్లె, రేగడిపల్లె, కల్లుట్ల, తదితర గ్రామాలలోని రైతుల నుంచి వేల ఎకరాలను కొనుగోలు చేశారు. 1996 సంవత్సరంలో ఎకరా రూ.50వేలతో 800 ఎకరాలు, 2006-07 సంవత్సరంలో రూ.1.25వేలతో 1200 ఎకరాలు, 2008-09 సంవత్సరంలో రూ.4లక్షలతో 700ల ఎకరాలకు పైగా భూములను.. మొత్తం 2,700 ఎకరాలకు పైగా కొనుగోలు చేసింది.

పరిశ్రమ ఏర్పాటు కాకపోవడంతో....

రైతుల నుంచి భూములు కొనుగోలు చేసినా సిమెంటు పరిశ్రమ మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో పంట పొలాలన్నీ బీడుగా మారాయి. వీటిల్లో కంపచెట్లు ఏపుగా పెరిగి అడవి పందులకు నివాస స్థలాలుగా మారి సమీప పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో 2010 సంవత్సరంలో ఏసీసీ భూ బాధితుల సంఘం ఏర్పాటైంది. పరిశ్రమ నిర్మించేంత వరకు బీడు వారిన తమ పంట పొలాలను తామే సాగు చేసుకుంటామంటూ 2010 జూన్‌లో పెద్దఎత్తున ఉద్యమం చేశారు. ఇన్నాళ్లు పరిశ్రమ ఏర్పాటును నానబెడుతూ వచ్చిన ఏసీసీ యాజమాన్యం 2016 సెప్టెంబరు 9వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ఏర్పాటు చేసింది. అయితే రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. చివరకు అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 16వ తేదీ గొల్లపల్లె సమీపంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను పరిష్కంచాలని పట్టుబట్టారు.


ఏసీసీ పరిశ్రమ కోసం రైతులు ఇచ్చిన భూములు

రైతులు డిమాండ్లు ఇలా...

ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో రైతులు తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎకరా యాభైవేలు, లక్షా ఇరవైఐదు వేల రూపాయలతో భూములను విక్రయించిన రైతులకు అదనపు పరిహారం చెల్లించాలన్నారు. విద్యార్హతతో నిమిత్తం లేకుండా భూములు కోల్పోయిన రైతులకు ఇంటికి ఒక ఉద్యోగం, శాశ్వత ఉపాధి కల్పించడం, ఫ్యాక్టరీ నిర్మాణ పనుల్లో భూ నిర్వాసితులకు ప్రాధాన్యత కల్పించడం, పరిశ్రమలో బ్లాస్టింగ్ జరుగుతున్న ప్పుడు సమీప గ్రామాల ఇళ్లకు ప్రమాదం సంభవిస్తే అప్పటి ధరల ప్రకారం ఆ ఇంటికి కొనడం లేదా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేస్తామని చెప్పారు. దాదాపు ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం జరగలేదు. అప్పటి వైసీపీ నాయకులు, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 28 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఏసీసీ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణానికి ముందుకు రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలల్లో ఏ ఒక్క రోజు ఏసీసీ పరిశ్రమ గురించి నోరెత్తకుండా ఏసీసీ భూ బాధిత రైతులకు అన్యాయం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ యువనాయకులు భూపేశ్ రెడ్డిలు గ్రామాల్లో ప్రచార సమయాల్లో ఏసీసీ పరిశ్రమ నిర్మించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో భూ బాధిత రైతులు న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

పరిశ్రమ నిర్మాణానికి కృషి చేయాలి



రెండు దశాబ్దాలకు పైగా పరిశ్రమ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఏసీసీ యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. 2016 లో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించి.. త్వరలో పరిశ్రమ నిర్మిస్తామని ఏసీసీ యాజమాన్యం, పెద్దలు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా పరిశ్రమ నిర్మాణం జరిగేలా చూడాలి.

- మహమ్మద్, రైతు చిన్నవెంతుర్ల గ్రామం

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం..



నేను నాకున్న 8 ఎకరాల పొలాన్ని ఏసీసీ పరిశ్రమకు అమ్మాను. ఏసీసీ యాజమాన్యం 28 సంవత్సరాలుగా పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. నాలాగే చుట్టూ పక్కల గ్రామాల రైతులు చాలామంది పరిశ్రమ నిర్మిస్తారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఎదురు చూస్తున్నారు.కొత్త ప్రభుత్వమైన ఏసీసీ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తుందని ఆశిస్తున్నాం.

- గంగరాజు. రైతు వద్దిరాల గ్రామం

ప్రశాంతంగా ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 27: ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 24 నుంచి 27 వరకు ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమేటిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లతో పాటు పలు యూనివర్శిటీల ప్రొఫెసర్స్ హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరి రోజు సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ లలిత, అసిస్టెంటు ప్రొఫెసరు లాజర్, ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసరు విశ్వనాథ రెడ్డి, మైసూరు యూనివర్శిటీ ప్రొఫెసర్ సంపత్‌కుమార్‌లు హాజరయ్యారు.

విజయవాడ నుంచి బెంగళూరుకు రైలు నడపాలి

టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 27: ఏపీ రాజధాని విజయవాడ నుంచి నంద్యాల మీదుగా ప్రొద్దుటూరు గుండా బెంగళూరుకు ప్రత్యేక రైలు నడపాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గతంలో కడప నుంచి బెంగుళూరుకు రైలు మార్గం మంజూరు చేయించి దాదాపు 20 కిలో మీటర్లు పనులు చేపట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. మళ్లీ ఈ రైలు మార్గం కడప నుంచి పూర్తి చేయాలంటే మూడు వేల కోట్ల వ్యయం అవుతుం దన్నా రు. అందువల్లే విజయవాడ నుంచి బెంగుళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా కేంద్ర మంత్రులను కలుస్తానన్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు విజయవాడ నుంచి ధర్మవరం వరకు నడుపుతున్న రైలును బెంగుళూరు వరకు పొడిగిస్తే చాలన్నారు.

ఉరి వేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


అనూష మృతదేహం

బి.కోడూరు, జూన్ 27: పోరుమామిళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని అనూష (18) ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. వివరాలిలా.. మండల పరిధిలోని రాజుపాలెం (హెచ్ డబ్ల్యు) గ్రామానికి చెందిన మున్నెల్లి శంకరయ్య, చెన్నమ్మ దంపతుల రెండో కూతురు అనూష పోరుమామిళ్లలో డిగ్రీ సెకండియర్ చదువుతోంది. ఇటీవల కాలేజీకి సెలవులు రావడంతో మృతురాలి పెద్దమ్మ మైదు కూరు మండలం వనిపెంట గ్రామ కాలనీలో నివాసం ఉండగా, ఆమె దగ్గరికి వెళ్లింది. అదే కాలనీలోని సందీప్ అనే అబ్బాయితో పరిచయం ఏర్పడి.. చనువుగా ఉండేది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయారు. ఈవిషయమై మృతురాలి తల్లిదండ్రులు ఈనెల 15న బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జయరాములు తన సిబ్బందిని పంపించి ఇరువురిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి.. అనూషను వారి తల్లిదండ్రులతో పంపించారు. అప్పటి నుంచి అనూష వారి తల్లిదండ్రుల వద్దనే ఉంది. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు కానీ గురువారం ఇంటిలో ఎవరూ లేనిది చూసి 10గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్ఐ జయరాములు కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరు మామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నీటి గుంతలో పడి విద్యార్థి మృతి


జస్వంత్‌నాయక్ మృతదేహం

సుండుపల్లె, జూన్ 27: మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛాకు చెందిన వెటర్నరీ డాక్టర్ మూనేనాయక్ కుమారుడు జస్వంత్‌నాయక్ (15) పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఇంట్లో స్నానానికి నీళ్లు లేవని ప్రాజెక్టు దిగువ భాగంలోని పింఛా నది ఒడ్డున స్నానానికి వెళ్లి కాలుజారి నీటి గుంతలో పడిపోయారు. ఎవరు చూడకపోవడంతో ఊరంతా వెతికి గురువారం తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు నది సమీపంలో వెతుకుతుండగా మృతదేహం లభించింది. మృతుడు జస్వంత్‌నాయక్ రాజంపేట నవోదయ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలియజేశారు. విద్యార్థి కుటుంబీకులు, బంధుమిత్రులు గుండెలు పగిలేలా రోధిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



జమ్మలమడుగు, జూన్ 27: మండలంలోని ముద్దనూరు రోడ్డు చిటిమిటి చింతల (పాటి) గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శేగారి మార్క్ (49) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ముద్దనూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన శేగారి మార్క్ జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో బంధువుల పెళ్లికి స్కూటర్‌లో బయల్దేరాడు. చిటిమిటి చింతల గ్రామ సమీపాన రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి ఉండగా.. ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్ పడడంతో ప్రమాదవశాత్తు స్కూటరిస్టు ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో మార్క్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాత్రి 11 గంటల సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు కార్లు దగ్ధం

- రూ.20 లక్షలు ఆస్తి నష్టం



రాయచోటిటౌన్, జనవరి 27: స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలకు సమీపం లో గల అపార్ట్‌మెంట్ వద్ద షార్ట్ సర్క్యూ ట్ కారణంగా రెండు కార్లు మంటలు చెలరేగి దగ్ధం అయ్యాయి. సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న చిత్తూరుకు చెందిన లోకేశ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఇలియాస్ తమ కార్లను పార్కింగ్ చేశారు. లోకేశ్‌రెడ్డికి సంబంధించిన కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న వారు భయభ్రాంతులకు గురై ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే లోకేశ్‌రెడ్డికి సంబంధించిన రూ.10లక్షల విలువ చేసే కారు పూర్తిగా కాలిపోవడంతో పాటు పక్కనే ఉన్న ఇలియాస్ కారు సగం పైగా కాలడంతో రూ.10 లక్షలకుపైగా నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

చికెన్ సెంటరులో అగ్ని ప్రమాదం

కడప (క్రైం), జూన్ 27 : కడప నగరం అప్సర సర్కిల్ సమీపంలోని రెడ్డి చికెన్ సెంటరులో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చికెన్ సెంటరు పై గదిలో పాత సామగ్రి ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి పైన ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయి. కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దాదాపు రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

యువకుడి హత్యకేసులో నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు, జూన్ 27: ప్రొద్దుటూరు వైఎంఆర్‌కాలనీలో సోమవారం తెల్లవారుజామున వెంకట మహేశ్వరరెడ్డి అనే యువకుడిని ముక్కలుగా నరికి చంపి శవాన్ని మాయం చేసిన సంచలన హత్య కేసును ఎట్టకేలకు రెండు రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. మృతుడి తల్లి ద్వార్శల సుబ్బరత్నమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసులోని నిందితుడు భూమిరెడ్డి రామచంద్రా రెడ్డిని గురువారం అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరు పెట్టి రిమాండుకు తరలించారు. ఈసందర్భంగా త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐలు వెంకటరమణ, రమణారెడ్డి, కరీం, శ్రీకాంత్‌లతో కలిసి డీఎస్పీ మురళీధర్ వివరాలు వెల్లడించారు. వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయం వీధిలో భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వార్శల సుబ్బరత్నమ్మ, ఆమె కుమారుడు మహేశ్వరరెడ్డి కలిసి కొన్నేళ్లుగా కలిసి జీవనం సాగిస్తున్నారు. సుబ్బరత్నమ్మకు 30 ఏళ్ల క్రితం శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తితో వివాహమైంది. వారిద్దరికి మహేశ్వర్‌రెడ్డి అనే కుమారుడు వున్నాడు. కొన్నేళ్లకు భార్యాభర్తలకు మధ్య విబేధాలు రావడంతో విడిపోయారు. దీంతో గత 20 ఏళ్లుగా సుబ్బరత్నమ్మ రామచంద్రారెడ్డితో కలిసి ఉంటోంది. రామచంద్రారెడ్డి సుబ్బరత్నమ్మ దగ్గర రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడని.. ఆ విషయంలో సుబ్బరత్నమ్మ కుమారుడు హహేశ్వర రెడ్డి రామచంద్రారెడ్డితో తరుచూ గొడవ పడేవాడన్నారు. ఇదే సందర్భంలో మహేశ్వరరెడ్డికి ఒక స్త్రీతో వివాహేతర సంబంధం వుండేది. ఆమెతో రామచంద్రారెడ్డి చనువుగా ఉండటంపై మహేశ్వరరెడ్డి రామచంద్రారెడ్డిని గట్టిగా ప్రశ్నించేవాడు. దీన్ని జీర్ణించుకోలేని రామచంద్రారెడ్డి మహేశ్వరరెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 23న రాత్రి మహేశ్వరరెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా రామచంద్రారెడ్డి ఇనుప పైపుతో తలపై బలంగా కొట్టి చంపాడు. శవాన్ని కనపడకుండా మాయం చేయడం కోసం గొడ్డలితో ముక్కలుగా నరికి లడ్డూలు తయారు చేసే సంచుల్లో శరీర భాగాలను వేసుకుని స్కూటీపై తీసుకెళ్లి జమ్మలమడుగు రోడ్డులోని రాయల్‌కౌంటి ఏరియాలో ముళ్లపొదల్లో వేశాడు. మహేశ్వరరెడ్డి తల్లి సుబ్బరత్నమ్మ అనారోగ్యం కారణంగా రాత్రి మందులు వేసుకొని నిద్రపోవడం వలన ఆమెకు జరిగిందేది తెలియలేదన్నారు. తెల్లవారిన తర్వాత ఇంట్లో రక్తపు మడుగులు వుండటం.. అంతకు ముందే రామచంద్రారెడ్డి స్కూటీలో ఏవో మూటలు తీసుకెళ్లడంతో ఆమెకు అనుమానం వచ్చింది. తన కుమారుడికి ఏమో అయ్యిందని భావించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామచంద్రారెడ్డి తన కుమారుడిని ఏమైనా చేసి వుంటాడని అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదును అందుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి.. పలు బృందాలుగా విడిపోయి మహేశ్వరరెడ్డి శవం కోసం గాలింపు చేపట్టారు. మరోవైపు నిందితుడు రామచంద్రారెడ్డి కోసం అన్వేషించారు. 24వ తేది సాయంత్రం జమ్మలమడుగు రోడ్డులోని రాయల్ కౌంటీ పరిసరాల్లోని ముళ్లపొదల్లో మృతి చెందిన మహేశ్వరరెడ్డి శరీరభాగాలు గల మూటలను గుర్తించారు. తల్లి సుబ్బరత్నమ్మ మృతుడిని గుర్తించాక పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మహేశ్వరరెడ్డి శరీర భాగాలను ఖననం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు గురువారం చెన్నూరు మండలం కొండపేట వద్ద తన బంధువుల ఇంట్లో తలదాచుకున్న ముద్దాయి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకుని హత్యకు దారితీసిన పరిస్థితులను విచారించారు. ఈ కేసులో సాక్ష్యాలను సమగ్రంగా సేకరించి నిందితుడికి శిక్షపడేలా కేసును పటిష్టంగా పెట్టామన్నారు. మీడియా ముందు ప్రవేశ పెట్టి రిమాండుకు తరలించారు. ఈ సంచలన హత్యకేసును సకాలంలో ఛేదించి నిందితున్ని పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అక్రమ కట్టడాల తొలగింపు చర్యలు వేగవంతం చేయండి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

ప్రొద్దుటూరు, జూన్ 27: రామేశ్వరం గ్రామ పొలంలోని ఫారెస్టు భూముల్లో అక్రమ నిర్మాణాను తొలగించాలని ఏప్రిల్‌లోనే లోకాయుక్త ఆదేశాలు ఇచ్చిందని... ఫారెస్టు అధికారులు త్వరితగతిన నోటీసులు జారీ చేసి వెంటనే తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని ఆర్‌డీవో శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్టు, విద్యుత్, పోలీసు, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రామేశ్వరం పొలంలోని సర్వే నెంబరు 558లో మొత్తం ఫారెస్టు భూమి 168.67 ఎకరాలు ఉండగా.. 16.23 ఎకరాలలో అక్రమంగా నిర్మాణాలు వెలిశాయన్నారు 16.23 ఎకరాల్లో 219 అక్రమ కట్టడాలు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారా అని సబ్ డివిజన్ ఫారెస్టు అధికారి దివాకర్‌ను ప్రశ్నించారు. ఇప్పటివరకు 60 మందికి పైగా నోటీసులు ఇచ్చామని.. మరికొందరు నోటీసులు తీసుకోవడం లేదని తెలిపారు. నోటీసులు తీసుకోకుంటే ఇంటి గోడలకు అంటించి ఫొటో తీసుకురావాలన్నారు. సోమవారం నాటికి నోటీసులు పూర్తిగా అందజేయాలన్నారు. అవసరమైతే రెవెన్యూ, పోలీసు, పంచాయితీ అధికారుల సహకారం తీసుకో వాలన్నారు. విద్యుత్ సరఫరా బంద్ చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. లేదంటే మీరు ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు పన్నులు వేశారా.. ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చారా అని పరిశీలించాలన్నారు. అలా ఇచ్చిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో తహసీల్దారు విద్యాసాగర్, డీఎస్పీ మురళీధర్, సీఐలు రమణారెడ్డి, శ్రీకాంత్, వెంకటరమణ, కరీం, ఫారెస్టు సబ్‌డివిజన్ ఆఫీసర్ దివాకర్, ఎఫ్ఆర్‌వో హేమాంజలి, సర్వేయర్లు వెంకటలక్ష్మి, సురేంద్ర రాజేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



లింగాల, జూన్ 27: మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన హరినాథ్ బైకులో వెళ్తుండగా ఇప్పట్ల క్రాసింగ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొందన్నారు. దీంతో హరినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అయితే హరినాథ్ కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



తనకల్లు, జూన్ 27: శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతపల్లి పంచాయతీ కొండకిందపల్లి (రత్నగిరి) గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు రమణ(40) గురువారం మృతి చెందారు. ఆయన స్వస్థలం అన్నమయ్య జిల్లా వడ్డివాండ్లపల్లి. అన్నమయ్య జిల్లాతోపాటు శ్రీసత్యసాయి జిల్లాలోని కొండకిందపల్లిలో ఆయనకు పొలాలు ఉన్నాయి. కొండకింద పల్లిలో టమోటా సాగు చేశాడు. పంటకు నీరు పడుతుండగా మోటారు ఆగిపోయింది. స్టార్టర్‌లో ఫ్యూజు పోయిందని తెలుసుకుని.. మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ పీజీసెట్ ఫలితాల్లో నిఖిలకు 10వ ర్యాంక్



కొండాపురం, జూన్ 27: గురువారం విడుదలైన ఏపీ పీజీసెట్ ఫలితాల్లో మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాళహస్తి నిఖిల 10వ ర్యాంకు సాధించించింది. ఈమె పీజీసెట్‌లో పొలిటికల్‌సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. 10వ తరగతి వరకు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదివింది. తమ గ్రామ విద్యార్థి స్టేట్‌ర్యాంక్ సాధించడంపట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), జూన్ 27: కడప నగరం నబీకోటలో ఓ మైనర్ బాలిక ఆత్మహత్య కేసుకు సంబంధించి ముగ్గురిని తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. నబీకోటకు చెందిన దివ్య(17) అదే ప్రాంతానికి చెందిన మాధవ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక బాబు జన్మించాడు. గత కొంత కాలంగా అత్త వెంకటసుబ్బమ్మ వేధిస్తుండటంతో ఇటీవల ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. ఈ మేరకు దివ్య అత్తతో పాటు మరో ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డయేరియా నియంత్రణకు చర్యలు

- డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు


పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 27: డయేరియా నియంత్రణకు వైద్య సిబ్బంది పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశించారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాయంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి జూన్ 30 వరకు స్టాప్ డయేరియాపై వైద్యసిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి గ్రామం, వార్డులలో డయేరియా రాకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డయేరియా కలుషిత ఆహారం, తాగేనీరు కలుషితం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధిసోకితే నీళ్ల విరోచనాలతో నీరసిస్తారన్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా 5 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేయాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల్లో నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ సీజన్‌లో తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, పరిసరాలతో పాటు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమహేశ్వరకుమా ర్, డాక్టర్ రవిబాబు, ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహం తీర్చడం మా కర్తవ్యం

● కొండకింద హరిజనవాడలో మంచినీటి బోరు ఏర్పాటు



బోరుబావిని తవ్విస్తున్న టీడీపీ నాయకుడు రవీంద్రారెడ్డి

సంబేపల్లె, జూన్ 27: దుద్యాల గ్రామంలో మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రజల దాహం తీర్చడం తమ కర్తవ్యమని టీడీపీ నాయకుడు రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం కొండకింద హరిజనవాడ ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరుబావిని తవ్వించారు. దళితవాడ ప్రజలు ఎన్నికల ముందు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి రావడంతో ఎన్నికల అనంతరం మంచినీటి బోరు వేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో మంత్రి ఆదేశాల మేరకు సహాయ సహకారాలతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో దుద్యాల సర్పంచు లక్ష్మీదేవి, చిన్నప్ప, టీడీపీ నాయకులు సుగవాసి విద్యాధర్, శంకర్, అబ్దుల్‌ఇజాజ్, కొండయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేశా డిమాండ్

రాయచోటిటౌన్, జూన్ 27: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో గురువారం డీఈఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషా మాట్లాడుతూ జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తమ పాఠశాలల పేర్లతో టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్, మెటీరియల్స్‌ను ముద్రించి మార్కెట్ ధరలకంటే మూడు రెట్లు అధికంగా ఎంఆర్‌పీ రేట్లు నిర్ణయించి విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి, షేక్ షావలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

గాలివీడు, జూన్ 27: ఎరువులు, పురుగుల మందుల విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి సాయిల్ కన్జర్వేషన్ ఏడీఏ మనీ పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని ఎరువుల, పురుగుల మందుల, విత్తనాలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగాంగా స్టాక్ రికార్డులు, లైసెన్సు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. దుకాణదారుల ధరల బోర్డును రైతులకు కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. రైతులకు బిల్లులు తప్పక ఇవ్వాలని, కాలం చెల్లిన మందులను విక్రయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరాజుపల్లెలో సత్యమ్మతల్లికి పూజలు

చిట్వేలి, జూన్ 27: మండల పరిధిలోని వెంకటరాజుపల్లెలో సత్యమ్మతల్లికి ఘనంగా గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం బలిదానాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గంలో కూటమి జనసేన అభ్యర్థి గెలుపు కోసం అమ్మవారికి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు, ఆయన సతీమణి వరలక్ష్మీ, తనయుడు సాయివిశాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, గుత్తినరసింహ, అడ్వకేట్ బాలాజీ కూటమి నేతలు పాల్గొన్నారు.

మండల సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం

ఓబులవారిపల్లె, జూన్ 27: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కుళాయిస్వామి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. ప్రతి గ్రామ పంచాయతిలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు.

ప్రజాధనం దుర్వినియోగం

● ఏ ఒక్కరినీ వదలం

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జూన్ 27: గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజాధనాన్ని, ప్రజల భూములను కబ్జా చేసి ఆ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ జిల్లా కార్యాలయాలను నిర్మించిన ఏ ఒక్కరినీ వదలమని రాష్ట్ర రవాణ, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు గురువారం ఆయన జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ నిర్మాణం గురించి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో రంగస్వామిలతో చర్చించి ఆరా తీశారు. అనంతనం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేస్తే ఏదో జిల్లాలు అభివృద్ధి జరుగుతాయని అనుకున్నామన్నారు. కానీ గడిచిన ఐదేళ్ల కాలంలో కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు భూములను కాజేసి వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. గతంలో రాజులు కూడా ఇలాంటి కోటలను నిర్మించి ఉండరని ఆయన గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా చర్యలు తీసుకొని ప్రజా ప్రయోజనాల కోసం ఈ భవనాలను వినియోగిస్తామంటూ మంత్రి వెల్లడించారు.



జేసీ, ఆర్డీవోలతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

రెవెన్యూ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఏపీ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు రెవెన్యూశాఖలో ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రామోజీరావు చిత్రపటానికి నివాళులు

రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీలోని మండిపల్లి భవన్‌లో గురువారం రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు చిత్రపటానికి రాష్ట్ర రవాణా, క్రీడల, యువజనశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలంతో పోరాడిన యోధుడు రామోజీరావు అని ఆయన సేవలను కొనియాడారు.

పొలానికి వెళ్లేందుకు రస్తా కల్పించండి

● రైతు ఓబులేసు వేడుకోలు

సిద్దవటం, జూన్ 27: పొలానికి వెళ్లేందుకు రస్తా కల్పించాలంటూ టక్కోలి గ్రామ పంచాయతీలో నివాసం ఉంటున్న రైతు ఓబులేసు తహసీల్దారుకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ తనకు వారసత్వ రీత్యా సర్వే నంబరు 280 (0.91 సెంట్లు) పట్టా భూమి ఉందని, కొంత మంది రైతులు భూమిని ఆక్రమించేందుకు రస్తాను ఇవ్వకుండా అడ్డగిస్తున్నారని దీంతో తాను తన పొలంలోకి వెళ్లలేకపోతున్నానని ఆవేదన చెందాడు. ఈ విషయాన్ని రెవెన్యూ సిబ్బందికి విన్నవించినా అధికారులు ఆలస్యం చేస్తున్నారని, తన భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విషయంపై వీఆర్‌ఓ రమణను వివరణ కోరగా ఇరువురు రైతులను పిలిపించి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలియజేశారు.



రైతు ఓబులేసు

మహిళా సంఘాల ద్వారా పరిశ్రమలు

● టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం



బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న వెలుగు సిబ్బంది

రాజంపేట, జూన్ 27: మహిళలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని, మహిళా సంఘాల ద్వారా పరిశ్రమలు పెట్టిద్దామని టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. గురువారం రాజంపేట ఆర్‌అండ్‌బీ సభాభవనంలో డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది నియోజకవర్గంలోని ఆరు మండలాల సిబ్బందితో ఆత్మీయ సమావేశానికి సుగవాసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల డీఆర్‌డీఏ వెలుగు మహిళా సిబ్బంది ద్వారా వినూత్న రీతిలో రాజంపేట నియోజకవర్గంలో గడ్డి నుంచి గ్యాస్, నూనె తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గురువారం రాజంపేట ఆర్‌అండ్‌బి సభాభవనంలో డిఆర్‌డిఎ వెలుగు సిబ్బంది నియోజకవర్గంలోని ఆరు మండలాల సిబ్బందితో ఆత్మీయ సమావేశానికి సుగవాసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరు మండలాల్లో వెలుగు సిబ్బంది నిర్వహిస్తున్న బాధ్యతలను, వారు తీసుకుంటున్న రుణాలను తిరిగి చెల్లించే విధానాన్ని, రుణాలను ఏవిధంగా ఖర్చు చేస్తున్నారో తదితర అంశాలను సిబ్బంది సభ దృష్టికి తెచ్చారు. అనంతరం డీఆర్‌డీఏ డీపీఎం వేణుమాధవ్, గంగఅర్చన, అశోక్‌రెడ్డి, నరసింహులు, ఆనంద్‌బాబు, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యంను వెలుగు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఏకాంతసేవ

పెనగలూరు, జూన్ 27: పెనగలూరులో జరుగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేణుగోపాలుని ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ధర్మకర్త జిలకల సుబ్బయ్య, ప్రధాన కార్యకర్త సుబ్బనరసయ్యస్వామిలు తెలిపారు. దేవాలయంలోని ప్రధాన ద్వారం వద్ద వెండి ఊయలలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుడి ఉత్సవ వరులను కొలువుదీర్చారు. నేత్రపర్వంగా ముస్తాబు చేసిన ఊయలలో శ్రీవారి పొన్నుసేవను నిర్వహించారు. శ్రీవారి దేవాలయ తలుపులను మూసివేసి ఏకాంత సేవను ముగించారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు కొత్త బాలక్రిష్ణ, పంచాయతీ సుబ్బారెడ్డి, కందుల నరసింహులుతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 27: రాష్ట్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రోగెసిటి టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలో టీడీపీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌ను కలిసి ఏపీ మోడల్ స్కూల్ టీచర్లకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అలాగే జీఓ నెంబర్ 23 ప్రకారం 010 కింద జీతాలు చెల్లించాలని, ఏపీ మోడల్ స్కూల్ టీచర్లకు హెల్త్‌కార్డులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

● ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

రాయచోటిటౌన్, జూన్ 27: కాకినాడలో జూలై 8, 9, 10వ తేదీల్లో కాకినాడలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నారాయణ, మణికంఠ, మహేశ్, అంజన్‌రెడ్డి, వేణుగోపాల్, కిరణ్‌కుమార్, మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్‌ల భేటీ



రాజకీయ అంశాలపై చర్చిస్తున్న రూపానందరెడ్డి, సుగవాసి

రాజంపేట, జూన్ 27: రాజంపేటలో గురువారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం భేటీ అయ్యారు. కోడూరు నుంచి రాజంపేటకు వచ్చిన ముక్కా రూపానందరెడ్డి సుగవాసి బాలసుబ్రమణ్యంతో మాట్లాడారు. రాజంపేటలో కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్న వీరిరువురు పార్టీ పరిస్థితిపై అంతర్గతంగా చర్చించుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి భారీ మెజార్టీతో సీట్లు గెలుచుకుని అధికారంలోకి రావడం, సీఎంగా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణస్వీకారం చేయడం తదితర అంశాలపై వీరు మాట్లాడుకొన్నారు. వీరితో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, రైల్వేకోడూరుకు చెందిన సీనియర్ నాయకులు, ముక్కావారిపల్లె మాజీ సర్పంచ్ ముక్కా మధుసూదన్‌రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్‌వీ రమణ, ఊటుకూరు మాజీ సర్పంచ్ నారాయణ, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డిలు, మహిళా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి, మండల మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు కూచివారిపల్లె వెంకటయ్య, నరసింహులు, గుడారు విష్ణు, నామా నరసింహ, ఊటుకూరు నాయకులు చెంగల్‌రాయులు, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారులపై వైసీపీ నేతల జులుం : మేడా



మాట్లాడుతున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 27: మదనమోహనపురం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని వైసీపీ కార్యకర్తకు ఇవ్వాలని ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓను డిమాండ్ చేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని వైసీపీ కార్యకర్తకు ఇవ్వాలని ఉపాధిహామీ పీడీ మద్దిలేటికి సూచించడం సబబు కాదని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న తాను ఎంపీడీఓ ప్రకాశంను ప్రశ్నించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, లేబాక సర్పంచ్ నరసయ్య, టీడీపీ నాయకులు యానాది, షర్మిల, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రికార్డులు పరిశీలన

రైల్వేకోడూరు, జూన్ 27: పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో రికార్డులను గురువారం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.విశ్వనాథ్, ఇన్‌స్పెక్టర్ శివయ్యలు పరిశీలించారు. కర్నూలు ఉప కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయాన్ని పరిశీలించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10.10.2017లో ఆలయానికి చెందిన భూమిని మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ ఉంగరాల నాగేంద్రరావుకు కౌలుకు ఇచ్చారని, ఇందుకు సంబంధించిన డబ్బులు తనకు రాలేదని దేవాదాయ శాఖ అధికారులకు ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఆలయాల జూనియర్ అసిస్టెంట్ పి.సుధీష్‌రెడ్డి, అర్చకులు పవన్‌కుమార్, యోగీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

ఓబులవారిపల్లె, జూన్ 27: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలు అన్నారు. మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీ కమ్మపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త నిడమలూరి శంకరయ్యనాయుడు మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నిడమూరు వెంకటేశ్, సుధాకర్, కుమార్, రామక్రిష్ణయ్య, ధనుంజయ్య, నాగినేని రమేష్‌నాయుడు, పి.కోటేశ్వరరావు, రవీంద్రనాయుడు, నాగేంద్ర నాయుడు, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని నివారించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్

పెనగలూరు, జూన్ 27: మండలంలోని 4 ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల ద్వారా జరుగుతున్న దోపిడీని అధికారులు కట్టడి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల ద్వారా అధికంగా ఫీజులు వసూలు చేయడం, పుస్తకాలు తమవద్దనే కొనాలని షరతు పెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందుకుమార్, సాయికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అధికారులతో సమీక్ష

పుల్లంపేట, జూన్ 27: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం డయేరియా నివారణలో భాగంగా స్టాప్ డయేరియా కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాని శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి 31 వరకు డయేరియాను నివారించేందుకు అతిసార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటనారాయణ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ చక్రధర్‌రాజు, మెడికల్ ఆఫీసర్ శ్రీనిజ, ఈఓఆర్‌డీ పెంచలయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లేక భవన కార్మికుల అవస్థలు

● ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి

రాజంపేట, జూన్ 27: రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, 45 రోజులుగా పూర్తిగా పనులు నిలిచిపోవడంతో దానిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎస్ రాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యక్రమంలో మేస్త్రి కూలీల సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ మేస్త్రిలు ఇ.రమణ, నరసింహ, నాగభూషణం, రంగస్వామి, క్రిష్ణయ్య, జి.రమణ, సిద్దయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

సిద్దవటం, జూన్ 27: మాధవరం-1 గ్రామ పంచాయతీలో గురువారం జిల్లా మలేరియా అధికారి మనోరమ పర్యటించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పూడిక పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మాధవరం గ్రామ పంచాయతీ కడప-చెన్నై ప్రధాన రహదారి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి వాటర్ పోకుండా నీరు నిల్వ ఉండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండడం వల్ల విషజ్వరాలు సోకుతున్నాయని, అపరిశుభ్రంగా ప్రాంతాలను సందర్శించి వెంటనే అక్కడి పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి శ్రీవిద్య, సూపర్‌వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్త సుజాత, పంచాయతి సెక్రటరి లక్ష్మీనరసయ్య, ఆశా వర్కర్‌లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటిటౌన్, జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఆయన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మండెం సుధీర్‌కుమార్, రైతు సంఘం నాయకులు లక్ష్మీశేఖర్, రామచంద్రారెడ్డి, మరికొంత మంది రైతులకు కలిసి రాయచోటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతన్నల కోసం నూతన ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20 వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించేందుకు కృషి చేయాలన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి: సీపీఐ

రైల్వేకోడూరు, జూన్ 27: షరతులు లేకుండా నిరుపేదలకు రేషన్ కార్డులను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ మండల ఏరియా అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. గురువారం కోడూరు తహసీల్దార్ శివరాముడికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన నిరుపేదల కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవన్నారు. దీంతో పింఛన్లు రాక గత ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి వినయ్, మహిళా నాయకురాళ్లు సోనీ, రమ్య, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.20 వేల విరాళం

చిట్వేలి, జూన్ 27: మండల పరిధిలోని కంబరాయుడు ఆలయ సమీపాన నూతనంగా నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భక్తులు రూ.20 వేల విరాళాన్ని అందించారు. ఈ మేరకు గురువారం ఆలయ ధర్మకర్త, నిర్మాణ కర్త కట్టా రామ్మోహన్‌రావుకు చిట్వేలి గుడ్లవారిపల్లె కీ.శే. వెంకటసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు దు బత్తిన వెంకటసుబ్బారెడ్డి 10,116 అలాగే యామల సాంబమూర్తి కుమారుడు వెంకటేశ్ 10,116 విరాళంగా అందించారు.

వైభవంగా గంగమ్మ జాతర



రైల్వేకోడూరు, జూన్ 27: మండలంలోని రెడ్డివారిపల్లె, ఉప్పరపల్లె, బిల్లుపాటిపల్లె తదితర గ్రామాల్లో గురువారం వైభవంగా గంగమ్మతల్లి జాతరలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి గంగమ్మతల్లి ప్రతిమలను తయారు చేసి వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ దేవతకు కోళ్లు, మేకపోతులు, పొట్టేళ్లు భక్తులు సమర్పించుకున్నారు. విద్యుత్ దీపాలంకరణలు చేశారు. భక్తులు వివిధ రకాల వేషాలు వేసి అలరించారు. రాజకీయ ప్రముఖులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం గంగమ్మతల్లిని నిమజ్జనం చేస్తారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, జూన్ 27: పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం ఆకేపాడు, మందపల్లె ఉన్నత పాఠశాలల్లో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, ప్రధానోపాధ్యాయులు రమణయ్యశెట్టి, సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ఆయన ఆరునెలల పాటు లేదా కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించేంత వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు సహకార సంఘాలకు గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నాన్-అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సెవెన్‌మెన్ కమిటీలు ఈనెల 8వ తేదీన, చైర్‌పర్సన్లు ఎస్.రెడ్డెమ్మ, ఎస్.నాగలక్ష్మిలతో సహా సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో పాలకవర్గాలు రద్దయ్యాయి. అప్పట్నుంచి రెండు సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ఇక అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి నియామకంతో కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

నెలాఖరులోగా ఎన్నికల వ్యయ వివరాలు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ ఆఫీసర్ క్రిష్ణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: సాధారణ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులందరూ ఈ నెలాఖరులోగా తుది వ్యయ వివరాలను అందజేయాలని జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి డిప్యూటీ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్లు, ఏఆర్వోలకు ఖర్చు వివరాలు అందించాలంటూ ఇదివరకే నోటీసులు పంపామన్నారు. శుక్ర, శనివారాల్లో ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు వస్తున్నారని, అభ్యర్థులందరూ ఖర్చుల వివరాలను సంతకంతో కూడిన తుది నివేదికలు అబ్జర్వర్లకు అందించాలని అన్నారు.

రెండు వ్యాన్ల ఢీ : ముగ్గురికి గాయాలు



గుడిపాల, జూన్ 27: బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలోని ఎన్‌సీఆర్ క్రాస్ వద్ద గురువారం రెండు వ్యాన్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. తమిళనాడు నుంచి చిత్తూరు వైపు వస్తున్న వ్యాన్ చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న మరో వ్యానును ఢీకొన్నాయి. ఈ ఘటనలో కంచి ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్న చిత్తూరు గొల్లవీధికి చెందిన రాజేశ్వరి, కణ్ణన్, సౌందరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయ అధికారుల నిజాయితీ



పోగొట్టుకున్న నగదును భక్తులను అందజేస్తున్న ఆలయ అధికారులు

తిరుచానూరు, జూన్ 27: కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు చెందిన జమున అనే భక్తురాలు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి ఆలయానికి గురువారం మధ్యాహ్నం విచ్చేశారు. దర్శనానంతరం ప్రసాదాలు స్వీకరించే కౌంటర్‌లో ఆమె పర్సును పోగొట్టుకుంది. గుర్తించిన ఆలయ అధికారులు పర్సును స్వాధీనం చేసుకుని అందులోని గుర్తింపు కార్డుల ఆధారంగా ఆలయంలోని మైక్‌సెట్‌ద్వారా అనౌన్స్‌మెంట్ చేయగా, భక్తురాలు జమున ఆలయం వద్దకు చేరుకున్నారు. పర్సులో ఉన్న రూ.28వేల నగదుతో క్రెడిట్, డెబిట్‌కార్డులను సూపరింటెండెంట్ మధు, విజిలెన్స్ ఏఎస్ఐ బ్రహ్మానందరాజు, ఆలయ సిబ్బంది అందజేశారు. ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం సహా నిందితుడితో అటవీ సిబ్బంది

భాకరాపేట, జూన్ 27: ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు ఫారెస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం చామల వెస్ట్ బీట్ బొమ్మాజీ కొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా.. ఎర్రచందనం తీసుకువస్తూ అటవీ సిబ్బందిని చూసి దుంగలు పడేసి పారిపోతుండగా తమిళనాడుకు చెందిన శక్తివేల్ రామస్వామిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ గాలించగా సమీపంలో ఉన్న 124 కిలోల బరువు గల ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు లోకనాథం, సదాశివయ్య, రెడ్డప్పరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు

- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూన్ 27: జిల్లాలో అక్రమ మైనింగ్‌ను కట్టడి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి ఆయన జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన సత్వరం సమగ్ర నివేదికను తయారు చేసి తనకు సమర్పించాలన్నారు. దీనికోసం మండలాలవారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అక్రమ మైనింగ్ కార్యాకలాపాలు జరిగినట్లు తెలిసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ దందాను అణచి వేయడానికి అధికారులు సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ మినరల్స్‌లో భాగంగా 665 లీజులకు అనుమతి ఇచ్చినట్లు మైన్స్ డీడీ ఎల్వీ ప్రసాద్ కలెక్టర్‌కు తెలిపారు. లీజుల కాలపరిమితి, ఎక్కడెక్కడ లీజులకు ఇచ్చిన స్థలం కాకుండా అదనపు స్థలంలో మైనింగ్ జరుగుతోంది, పరిమితికి మించిన అక్రమ రవాణా తదితర వివరాలన్నింటినీ వెంటనే నివేదిక రూపంలో ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హాస్టళ్లలో వసతులపై 7లోగా నివేదిక ఇవ్వండి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వసతి గృహాలలో మౌలిక వసతులపై జూలై 7వ తేదీలోగా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వసతుల కల్పనతోపాటు ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల వివరాలనూ సేకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.పుల్లయ్య, డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, ఏపీసీ వెంకటరమణారెడ్డి, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుప్పం అధికారులతో సమీక్ష

కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో, నియోజకవర్గ తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలెక్టరు సుమిత్‌కుమార్ సమీక్షించారు. సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన సందర్భంగా ప్రజలనుంచి అందిన అర్జీలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ప్రతి సచివాలయం పరిధిలో ఒక వీఆర్వో, ఒక విలేజ్ సర్వేయర్ కలిసి ప్రతి గడపకు వెళ్లి రెవెన్యూ సంబంధమైన పాస్ బుక్ మ్యుటేషన్లు, భూమి సర్వే, ఆక్రమణలు తదితర దరఖాస్తులు స్వీకరించి, నివేదికను తయారు చేయాలన్నారు.

రామోజీకి టీడీపీ నేతల నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 27: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు టీడీపీ నేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ రామోజీరావు సామాన్య కుటుంబంలో పుట్టి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకుని ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పాత్రికేయ రంగంలో విలువలకు ప్రాధాన్యత నిచ్చి, నిజాన్ని నిర్భయంగా చెప్పారని అన్నారు. లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు చంద్రప్రకాష్, త్యాగరాజన్, సప్తగిరి ప్రసాద్, సుబ్రమణ్యం నాయుడు, మోహన్‌రాజ్, హేమాద్రి నాయుడు, సీఎం విజయ, వరలక్ష్మి, రాణి, నాగలక్ష్మి, జయచంద్రనాయుడు, యుగంధర్, విజయ్‌కుమార్, బాబు నాయుడు పాల్గొన్నారు.

సేద్యానికి మంచి రోజులు: కలెక్టరు

- పీఎంజేవై కింద మహిళా రైతులకు వ్యవసాయ ఉపకరణాల పంపిణీ



మహిళా రైతులకు టార్పాలిన్లు, డ్రమ్ములు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

కుప్పం, జూన్ 27: జిల్లాలో వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కుప్పంలో గురువారం ఆయన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి మహిళా రైతులకు వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా షెడ్యూల్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో పీఎంజేవై కింద 1,205 మంది రైతులు లబ్ధిదారులుగా ఎంపిక కాగా, అందులో కుప్పం నియోజకవర్గంలోనే 518 మంది ఉన్నారని కలెక్టరు చెప్పారు. ఎంపికైన రైతులకు రూ.5 వేల విలువైన రెండు టార్పాలిన్లు, రూ.1,830 విలువ కలిగిన 200 లీటర్ల డ్రమ్ ఒకటి, రూ.1,020 విలువ కలిగిన చిన్న డ్రమ్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని చాలాగ్రామాలలో ఆవు పేడ, గోమూత్రం, ఇతర ప్రకృతి సంబంధమైన ఎరువులతో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలు ఆరోగ్యదాయకమైనవని, విస్తృతమైన మార్కెటింగ్ కూడా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఇంకా రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుప్పంలో పేదరిక నిర్మూలనను సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. 2014-19లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ప్రకృతి వ్యవసాయ ఆద్యుడు సుభాష్ పాలేకర్ మన రాష్ట్రాన్ని దత్తత తీసుకుని ఆ విధానంపై వివిధ ప్రాంతాలలోని రైతులకు శిక్షణ ఇచ్చారని గుర్తుచేశారు. దీంతో కుప్పం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో చేకూరే లాభాలు, దిగుబడి, ఇతర ప్రయోజనాలను తమ సొంత అనుభవాల నుంచి మహిళా రైతులు విజయలక్ష్మి, నాగభూణమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీపీఎం వాసు, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ రాజ్యలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, మహిళా రైతులు పాల్గొన్నారు.

కుప్పంలో అదనపు మండలాల ఏర్పాటుకు కమిటీ

కుప్పం, జూన్ 27: కుప్పం రెవెన్యూ డివిజన్‌లో అదనంగా రెండు మండలాల ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఓ కమిటీని నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న ఈనెల 24వ తేది ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించిన సీఎం.. ప్రస్తుతమున్న నాలుగు మండలాలు కాకుండా అదనంగా కుప్పం మండలంలోని మల్లానూరు, శాంతిపురం మండలంలోని రాళ్లబూదుగూరు ప్రాంతాలను మండలాలుగా ఏర్పాటు చేసే విషయంలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, ఈ పర్యటనకు ఒకరోజు ముందే దీనిపై కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. అంటే సొంత నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి స్థానిక ఎమ్మెల్యే కూడా అయిన చంద్రబాబు ఎంత ప్రాధాన్యమిస్తున్నారన్న విషయాన్ని ఈ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి. వీలైనంత త్వరలోనే ప్రస్తుతమున్న కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు అదనంగా మల్లానూరు, రాళ్లబూదుగూరు మండలాలతో కుప్పం రెవెన్యూ డివిజన్‌లోని మండలాల సంఖ్య ఆరుకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికార యంత్రాంగం అభిప్రాయపడుతోంది.

రాష్ట్రస్థాయి విజేతలకు రూ.లక్ష చొప్పున బహుమానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న చైతన్యకుమార్‌రెడ్డి

గంగవరం, జూన్ 27 : ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శ్రీవాణి, మధు కళాశాలల విద్యాసంస్థల చైర్మన్ క్రిష్ణమూర్తిరెడ్డి రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. బుధవారం విడుదలైన ఫలితాలలో స్థానిక శ్రీవాణి, మధు కళాశాలల విద్యార్థులు ఎంపీసీ గ్రూపులో చేతన, కరిష్మ 470 మార్కులకు 466, బైపీసీలో అల్బిన్ 440 మార్కులకు 436, సీఈసీలో ఫిజా అంజుమ్ 500 మార్కులకు 486 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో పేరు సాధించారు. పలమనేరు పరిసరప్రాంతాల్లో అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. టాపర్లుగా నిలిచిన వారికి జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి దుశ్శాలువాలు కప్పి సత్కరించి కళాశాల తరఫున ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఆనందరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం, దినేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చాలి



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

తిరుపతిరూరల్, జూన్ 27: చిరుధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగం చేయడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచవచ్చని భారత వ్యవసాయ పరిశోధనామండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ పేర్కొన్నారు. తిరుపతిలోని వెటర్నరీవర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.దేశవ్యాప్తంగా చిరుధాన్య పంటలసాగు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత అధికంగానే ఉందని తెలిపారు.5వేల సంవత్సరాలుగా సాగులో ఉన్న పంటగా సజ్జకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ ఏపీలో ప్రతిజిల్లాలో ఒక్కొక్కరకం చిరుధాన్యపంట సాంప్రదాయపంటగా సాగులో ఉందని, ఐసీఏఆర్ సహకారంతో వర్సిటీపరిధిలోని నాలుగు పరిశోధనాస్థానాల్లో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తూ అనువైన చిరుధాన్య రకాలను, సాగుకు అవసరమైన సాంకేతికతను అందిస్తున్నామని తెలిపారు.పోషకాహార భద్రతలో చిరుధాన్య పంటల పాత్ర ఎక్కువగా ఉందని, కొవిడ్-19 తర్వాత చిరుధాన్య ఆహారంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్ మాట్లాడుతూ ఉత్పాదకత పెంచితే చిరుధాన్యాల సాగు లాభదాయకమవుతుందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ,ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్,ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీవ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, 220మంది పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై తిరుపతి కార్పొరేషన్ కొరడా



గాంధీరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై తిరుపతి నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పురిగొల్పి చిరువ్యాపారులనుంచి నెలవారీ మామూళ్లను అధికార పార్టీ నేతలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై దృష్టిసారించింది. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు పార్టీ శ్రేణులతో కలసి ఐదు రోజుల క్రితం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌తో పాటు టీటీడీ ఈవోకు, ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. స్మార్ట్ సిటీ నిధులతో పాదచారులకోసం అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. బాటసారులకు నడిచేదారిలేక అవస్థలు పడుతున్నారు.చాలాచోట్ల ఫుట్‌పాత్‌లపై శాశ్వత నిర్మాణాలు చేపట్టి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రహదారిపైకి వచ్చే వాహనాలు వేగంగా వెళ్లడంతో బాటసారులు నడిచే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులో మొదలైన ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు గురువారం గాంధీరోడ్డుకు చేరుకుంది. విష్ణునివాసం, గోవిందరాజస్వామి ఆలయం, గాంధీరోడ్డు వరకు కార్పొరేషన్ అధికారులు పోలీసు బలగాలతో కలసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఇప్పటివరకు 60కిపైగా ఆక్రమణలు తొలగించినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం చెప్పారు. కొన్ని చోట్ల వైసీపీ, వామపక్ష నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు ముందుకు పోతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతుల కారణంగానే వైసీపీ నేతలు దందాలు చేసి తోపుడు బండ్ల దగ్గర వసూలు చేశారంటున్న వామపక్ష నాయకులు తొలగింపును తాము స్వాగతిస్తామంటున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నేతలు కూడా ఫుట్‌పాత్‌లపై బండ్లుపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదంటున్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ అని శుక్రవారం బైరాగిపట్టెడ, ఆ తర్వాత తిరుమల బైపాస్ రోడ్డువైపు వెళ్లనున్నట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే తోపుడు బళ్ల వ్యాపారం కోసం ప్రత్యామ్నాయంగా ప్రత్యేక హాకర్ జోన్స్ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఆ దిశగా కూడా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాల్సి వుందని పలువురు సూచిస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు తమిళనాట నో ఎంట్రీ

- తడనుంచి పికప్ వ్యాన్లలో చెన్నైకి ప్రయాణికుల తరలింపు
- ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లను ఒప్పుకోని తమిళనాడు అధికారులు
- కేసుల భయంతో తడ నుంచే రాకపోకలు సాగిస్తున్న బస్సులు
- పర్మిట్లు లేకుండా దర్జాగా తడకు వచ్చి వెళ్తున్న పికప్ వ్యాన్లు



తడ కరిపేటి కాలువ సమీపంలో నిలిచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

తడ, జూన్ 27 : ప్రైవేట్ బస్సులకు ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లపై తమిళనాడు ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దీంతో ఆ బస్సుల్లో ప్రయాణికులు తడ నుంచి చెన్నైకి పికప్ వ్యాన్లలో రాకపోకలు సాగించాల్సివస్తోంది. చెన్నై నుంచి తడ మీదుగా హైదరాబాదు, వైజాగ్, విజయవాడ ప్రాంతాలకు సుమారు 75కు పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.ఆలిండియా పర్మిట్ ద్వారా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల పేరుతో ఇవి ఎక్కడైనా ప్రయాణించే అవకాశం ఉంది. అయితే తమిళనాడు, ఏపీ, తెలంగాణా పరిధిలో ప్రయాణించే చాలా బస్సులు ఆయా రాష్ట్రాల్లో పర్మిట్లు పొందకుండా ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాకపోకలు సాగిస్తున్నాయి.ఈశాన్య రాష్ట్రాలలో పర్మిట్ పన్నుల వసూళ్ల తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏపీలో ఒక బస్సు సీటుకు 3 నెలల కాల వ్యవధికి సుమారుగా 3,500 రూపాయల వరకు పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండగా, తమిళనాడులో సుమారుగా 3,200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం ఒక సీట్‌కు కేవలం 400 రూపాయల లోపే పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అక్కడ పర్మిట్లు పొందుతున్నారు. పైగా ఆ రాష్ట్రాల్లో బస్సుల తనిఖీ ఉండదు. బస్సులు ఎక్కడో ఉన్నా మధ్యవర్తుల సహాయంతో కొంతసులభంగా ఆయా రాష్ట్రాల పర్మిట్లు దొరుకుతాయి. దీంతో మనరాష్ట్రంలో 40 సీట్లుగల ఒక బస్సుకు 3 నెలల కాలానికి సుమారు 1.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా, అదే బస్సుకు ఈశాన్య రాష్ట్రంలో కేవలం 16వేల రూపాయలకే పర్మిట్ అందుబాటులోకి వస్తుంది. ఇలాంటి బస్సులపై తమిళనాడు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. చెన్నై నుంచి ఏపీ, తెలంగాణాలకు వెళ్లినట్లుగానే తమిళనాడులోని వివిధ ప్రాంతాలతోపాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వందల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.ఇటీవల ఒడిశా, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పర్మిట్ పొందిన బస్సులపై తమిళనాడు ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. తమిళనాడు పర్మిట్లు సైతం పొందాలంటూ మెలిక పెడుతోంది. దీంతో ఆయా బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. చెన్నై నుంచి తడ మీదుగా రాకపోకలు సాగించే ఈ ప్రైవేట్ బస్సులను తడ వద్దే నిలిపివేసి పికప్ వ్యాన్ల ద్వారా ప్రయాణికులను అటుఇటు తరలిస్తున్నాయి.

పర్మిట్ లేకున్నా దర్జాగా రాకపోకలు

ఏపీలో రవాణాశాఖ చెక్‌పోస్టులను గత మార్చి నెలలో ప్రభుత్వం మూసివేసింది. తద్వారా వాహనాలు తనిఖీ చేసే అధికారులు లేకపోవడంతో కొందరు వాహనదారులు పర్మిట్లు లేకుండానే మనరాష్ట్రంలోకి వచ్చి వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా శ్రీసిటీ, నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ వరకు వందల సంఖ్యలో వాహనాలు పర్మిట్లు లేకుండానే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సైతం ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. ఏపీలోకి పర్మిట్లు లేని పికప్ వ్యాన్లలో ప్రయాణికులను తడ-చెన్నైల మధ్య తరలిస్తున్నాయి. ఓ పక్క ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా తాజాగా పర్మిట్లు లేని ఈ పికప్ వ్యాన్లు సైతం వచ్చి వెళ్తూ మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పైగా ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి పూర్తిస్థాయిలో బస్సు చార్జీలను వసూలు చేస్తూ చెన్నై- తడ మధ్య పికప్ వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇకనైనా రవాణాశాఖ అధికారులు పర్మిట్‌లేని పికప్ వ్యాన్లపై చర్యలు తీసుకోవడమేకాకుండా తమిళనాడు తరహాలో ఈ బస్సుల నుంచి పర్మిట్ల రూపేణా పన్నులు వసూలు చేయాల్సివుంది.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

● మదనపల్లె టమోటా మార్కెట్ కార్యదర్శితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ● పట్టణంలో పలుప్రాంతాల్లో విస్తృత పర్యటన

మదనపల్లె టౌన్, జూన్ 27: మదనపల్లె టమోటా మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మార్కెట్ కార్యదర్శి అభిలాష్‌ను ఆదేశించారు. గురువా రం ఎమ్మెల్యే పట్టణంలోని పలుప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్య లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టమోటా మార్కెట్‌ను పరిశీలిం చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌కు టమోటాలను తీసుకొచ్చే రైతు లు సాయంత్రం నుంచి రాత్రంతా ఇక్కడే ఉండి పోవాల్సివస్తోందని, రైతులు పడుకోవడానికి విశ్రాంతి గదులు, అందులో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు తగినన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో ట్రాఫిక్ స్తంభించకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వర్షం వస్తే పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. నిబంధనల మేరకు జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని, త్వరలో మార్కెట్‌లోని మండీ యజమానులు, వ్యాపారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఇందిరానగర్‌లోని ఆగిపోయిన షాదీమహల్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పక్కనే ఉన్న మున్సిపల్ ఉర్దూ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం రుచి చూసి సూచనలిచ్చారు. మురుగునీటి కాలువల శుభ్రం పనులు మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. కురవంకలోని ఎంపీటీసీ హారతి, బెల్లె ప్రసాద్ నివాసంలో కురవ సంఘం రాష్ట్ర నాయకుడు, టీడీపీ నాయకుడు వల్లిగట్ల రెడ్డెప్పతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పలు అంశాలపై చర్చించారు. కురవలు, బీసీలు, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మండలంలోని పోతబోలు సచివాలయం వద్ద దాతలు ఎమ్మెల్యే చేతుల మీదుగా చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని దీనిపై శాశ్వత పరిష్కారం చూపాలని అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.


టమోటా మార్కెట్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె అర్బన్, జూన్ 27: భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో మీడియాతో డీఎస్పీ మాట్లాడుతూ కురబలకోట మండలం, పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ, మేకలవారిపల్లెకు చెందిన తెట్టు రమణమ్మ (45)ను భర్త తెట్టు లక్ష్మిరెడ్డి (47)ఈ నెల 21వ తేదీన ఇంట్లోని కొడవలితో నరికి హత్య చేసిన విషయం పాఠకులకు విదితమే. గత కొంతకాలంగా మద్యానికి అలవాటుపడి ప్రతి రోజు తాగి వచ్చి భార్యను చిత్రహింసలు పెట్టేవాడు, దీంతోపాటు భార్యపై అనుమానం పెంచుకున్నా అతను 21వ తేదీన ఇంట్లో నాలుగు కోళ్లు చనిపోయిన విషయం తనకు చెప్పలేదనే కోపంతో తన భార్య తెట్టు రమణమ్మను పథకం ప్రకారమే ఇంటిలోపల గడియ పెట్టి నిద్రమత్తులో ఉన్న ఆమె తలపై చేతులపై, శరీరంపై విచక్షణా రహితంగా నరికి చంపి అక్కడ నుంచి పరారయ్యాడు. నిందితుడు కురబలకోట మండలం, కడప క్రాస్ వద్ద మదనపల్లె-కడపరోడ్డులో ఉన్నట్లు ముదివేడు పోలీసు స్టేషన్‌కు సమాచారం రావడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని అరెస్టు చేశారన్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐ ఎస్ శేఖర్, టూ టౌన్ సీఐ యువరాజు, రూరల్ సర్కిల్ సీఐ సద్గురు, ముదివేడు ఎస్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో నిందితుడు అరెస్ట్

బి.కొత్తకోట, జూన్27: బి.కొత్తకోట మండల పరిధిలో భార్యను హతమార్చిన భర్తను అరెస్టు చేసినట్లు బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ తెలిపారు. మండల పరిధిలో ఈ నెల 25 న పట్రవారిపల్లెకు చెందిన అన్నపూర్న(25)ను కట్టుకున్న భర్త మల్లికార్జున గొంతు నులిమి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతురాలి అన్న సూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. ఈ ఘటనలో నిందితుడైన అన్నపూర్న భర్త చిక్కబళ్లాపురం కు చెందిన మల్లికార్జున అలియాస్ మల్లి(32)ను గురువారం బెంగళూరు రోడ్డులో అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

వాహనం సహా 16 దుంగలు స్వాధీనం

పీలేరు, జూన్ 27: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఒక వాహనంతో సహా 16 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు రెండు బృందాలతో కాపుకాచి గురువారం ఉదయం కలకడ నుంచి పీలేరువైపు అనుమానాస్పదంగా వస్తున్న కేఏ01 ఎంఈ 6211 నెంబరు గల కారును వెంబడించగా గమనించిన కారులోని నలుగురు వ్యక్తులు పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 439 కేజీలు బరువున్న 16 ఎర్రచందనం దుంగలు లభించగా కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో తనతో పాటు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది నాగేంద్రబాబు, దేవేంద్రబాబు, వెంకటేశ్, డ్రైవర్ చరణ్, తదితరులు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

ఎరువులు..విత్తన దుకాణాల తనిఖీలు

- రూ.75వేల విలువగల విత్తనాలు సీజ్

బి.కొత్తకోట, జూన్27: బి.కొత్తకోట పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల షాపులను బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు వైవీ రమణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ఫారం-ఓ లేని రూ.75వేలు విలువ గల ఎరువులను సీజ్ చేసి వాటి విక్ర యాలను నిలుపుదల చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే రైతులకు విక్రయాలు జరపాలని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మడం, బ్లాక్‌లో నిల్వలు ఉంచినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఉన్నారు.

కబ్జాదారుల నుంచి వ్యవసాయ భూమిని కాపాడండి

● రాష్ట్ర హోం మంత్రికి ఓ మహిళా రైతు ఫిర్యాదు.


మాట్లాడుతున్న మహిళారైతు

బి.కొత్తకోట, జూన్27: కబ్జాదారుల నుంచి తమ వ్యవసాయ భూమిని కాపాడాలంటూ బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఓ మహిళారైతు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి బాధితురాలి కథనం మేరకు వివరాలిలావున్నాయి. బి.కొత్తకోట హడ్కో కాలనీకి చెందిన బీద అరుణ పట్టణశివారు గుమ్మసముద్రం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 667లో 0.79 ఎకరాల వ్యవసాయ భూమిని 2019లో కొంత, 2023లో మరికొంత కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి పట్టాదార్ పాస్‌బుక్ సైతం పొందింది. ఈనెల 23న ఉదయం ఆ పొలంలో వేరుశనగ విత్తనాలను వేసింది. అయితే విత్తనాలు వేసిన కొంత సేపటికి బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులు మరో ఇద్దరు ఓ ట్రాక్టర్ తీసుకొచ్చి పొలాన్ని దున్నేశారని వాపోయారు. దీంతో బాధితురాలు అరుణ బి.కొత్తకోట పోలీసులకు భూమిలోకి అక్రమంగా కొంద రు చొరబడి పంటసాగును ధ్వంసం చేశారని చర్యలు తీసుకోవాలని కోరింది. అయితే పోలీసులు తగిన రీతిలో స్పందించలేదని రాష్ట్ర హోంమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశానని, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి సానుకూలంగా స్పందించి ఈ ఘటనకు సంబంధించి వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు.

వైభవంగా కోటగంగమ్మ తిరుణాల

తంబళ్లపల్లె, జూన్ 27: తంబళ్లపల్లెకు సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ తిరుణాల బుధ, గురువారాల్లో వైభవంగా జరిగింది. కోటకొండ గంగమ్మా...చల్లంగా చూడమ్మ అంటూ భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి కర్పూర హారతులతో వేడుకున్నారు. బుధవారం రాత్రి పలు గ్రామాల ప్రజలు చాందినిబండ్లు కట్టి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూరా తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తంబళ్లపల్లె పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో తిరుణాల ప్రాంగణం అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టూ తిప్పి భక్తులకు అమ్మవారి దీవెన బండారును అందచేశారు.

రేపు గ్రామదేవత చింతలగంగమ్మ తిరుణాల

పెద్దమండ్యం, జూన్ 27: పెద్దమండ్యంలో వెలసిన గ్రామ దేవత చింతలగంగమ్మ తిరుణాల శనివారం రాత్రి జరుగనున్నట్లు నిర్వహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు వైభవంగా జ్యోతులు, బోనాలు సమర్పిస్తారని తెలిపారు.

బి.కొత్తకోటలో వాహనాల తనిఖీ

బి.కొత్తకోట, జూన్27: బి.కొత్తకోట పట్టణ శివారులో గురువారం మదనపల్లె మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధృవపత్రాలు సరిగాలేని 5 వాహనాలకు సంబంధించి రూ.1.20 లక్షలు అపరాధం వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ లను పొందాలని, ధృవపత్రాలు లేని వాహనాలను నడపడం, కలిగి ఉండటం నేరమని గుర్తించాలని అన్నారు.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి కార్యాచరణ

కలికిరి, జూన్ 27: వివిధ రకాల సామాజిక పింఛన్లను జూలై 1వ తేదీన ఇంటింటికీ పంపిణీ చేయడానికి మండల స్థాయిలో అధికార్లు కార్యాచరణకు ఉపక్రమించారు. సచివాలయ ఉద్యోగుల చేత ఇంటింటికీ వెళ్లి పింఛన్లను నేరుగా అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలతోపాటే అందుకు వసరమైన నిధులను కూడా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఖాతాలోకి గురువారం నాటికే జమ చేసేసింది. ఈ మేరకు అధికారులు పంపిణీని సాఫీగా చేయడానికి అనువుగా కార్యాచరణ రూపొందించడంలో నిమగ్నమయ్యారు. ఒక్కో ఉద్యోగికి 50 పింఛన్లకు మించకుండా పంపిణీకి అప్పగించాలని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు.

కలికిరి మండలానికి రూ. 4.5 కోట్లు జమ

జూలై నెలలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం కలికిరి మండలానికి అవసరమైన రూ. 4.5 కోట్ల నిధులను గురువారం నాటికే ఎంపీడీవో ఖాతాలో జమచేసింది. మొత్తం మండలంలో 7029 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా అందుకు 140 మంది ఉద్యోగులు అవసరమని గుర్తించినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య చెప్పారు. సచివాలయ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీ, వెలుగు ఉద్యోగులకు కూడా పంపిణీని అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండంలో 4334 మందికి వృద్ధాప్య పింఛన్లు, అభయహస్తం కింద 214 మందికి, 59 మంది చేనేతన్నలకు, తీవ్ర వికలాంగులు 195, మధ్యస్థ వికలాంగులు 695 మందికి, 1362 మంది వితంతువులు, 116 మంది ఒంటరి మహిళలు, 11 మంది కల్లుగీత వారికి, 41 మంది డప్పు కళాకారులకు, ఇద్దరు చర్మకారులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఒక రోజు వ్యవధిలోనే మొత్తం పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

బీసీల అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తా


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీసీ, కురబ సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, జూన్ 27: బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక కురవంక ఎంపీటీసీ బిల్లే హారతి, కురుబసంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిల్లే రెడ్డిప్రసాద్ గజమాలతో దుశ్శాలువాను ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అదే విధంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు వలిగట్ల రెడ్డెప్ప కురుబసంఘం నాయకులతో కలిసి కురవ సాంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రధాన్యత కల్పించిన ఘనత సీఎం నారాచంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పసుపులేటి వినోద్‌కుమార్, రామ్మూర్తి నాయుడు, మార్పురి నాగార్జున బాబు, మాజీ కౌన్సిలర్స్ పులి మహాలక్ష్మీ, రాధమ్మ, శ్రీనునాయక్, జేసీబీ మధు, 31వ వార్డు ఇన్‌చార్జీ రామకృష్ణ, కప్పల శ్రీరాములు, తిమ్మరాయుడు, జీవీ నాయుడు, మేజారి సదాశివ, రాజ్‌కుమార్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, జూన్ 27: మండలంలోని పలు సమస్యలపై మదనపల్లి శాసన సభ్యుడు షాజహాన్‌నబాషాకు మండల ప్రజలు ఫిర్యాదు చేశారు గురువారం నిమ్మనపల్లి అహోబిలనాయుని కట్ట వద్ద ఉన్న దర్గాకు మండలంలో పాటు ఇతర ప్రాతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని రోడ్డు నిర్మించాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు. అలాగే వెంగవారిపల్లి పంచాయతి కత్తెరవారిపల్లి సమీపంలో ఉన్న తిప్పన్నగుంట, తాతచెరువులు కబ్జాకు గురయ్యాయని సమీప ఆయకట్టుదారుల చెరువులను అక్రమించుకొన్నారని దీంతో చెరువులలో నీరు నిల్వ లేకుండా పోతున్నాయని మూగజీవాలకు నీరు తాగేందుకు కూడా ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో ఆయన సంబంధిత అధికారులకు పిలిచి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

● సీసీ రోడ్డు నిర్మాణం చేపడతాం


మురుగునీటి రోడ్డులో తోలిన మట్టిని పరిశీలిస్తున్న కార్యదర్శి

నిమ్మనపల్లి, జూన్ 27: మండలంలోని కొండయ్యగారి పల్లి పంచాయతి బొంగవారిపల్లిలోని రోడ్డుకు మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ కంపు కొడుతూ దుర్వాసన వెదజల్లుతుందని ఈ నెల 23వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో పచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం స్థానిక పంచాయతి కార్యదర్శి లోకేశ్వరి ఎక్స్‌కవేటర్, ట్రాకర్ల సహాయంతో మురుగునీరు ఉన్న స్థలంలో మట్టిని తోలించారు. ప్రస్తుతం ప్రజలు వీలుగా గ్రామంలోకి వెళ్లేందుకు చర్యలు తీసుకొన్నామని త్వరలో సీసీరోడ్డు నిర్మిస్తామని తెలిపారు. దీంతో ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా మురుగునీటిలో నడుస్తున్నా పట్టించుకొని పాపాన పోలేదని ఆంధ్రజ్యోతి పత్రికలో వార్త రావడంతో అధికారులు స్పందించి కనీసం మట్టి అయినా తోలారని హర్షం వ్యక్తం చేశారు.

నేడు కేవీపల్లెలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

పీలేరు, జూన్ 27: ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి శుక్రవారం కేవీపల్లె మండల సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు. ఈ మేరకు కేవీపల్లె మండల పరిషత్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే హోదాలో తొలి సమావేశం కావడంతో అందరూ ఆసక్తి చూపు తున్నారు. కేవీపల్లె ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం ప్రారంభం కానుంది.

ఘనంగా బంకిం చంద్రచటర్జీ జయంతి

వాల్మీకిపురం, జూన్ 27: వందేమాతరం గేయ రచయిత బంకిం చంద్రచటర్జీ జయంతి వేడుకలను గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో బంకిం చంద్రచటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్, పాఠశాల హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు ఆకాంక్షించే మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన సొసైటీ రామచంద్ర

మదనపల్లె అర్బన్, జూన్ 27: ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు ఏపీ రవాణా, క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అని మదనపల్లె టీడీపీ సీనియర్ నాయకుడు సొసైటీ రామచంద్ర అన్నారు. గురువారం సొసైటీ రామచంద్ర, తన బాల్యమిత్రుడు రాయచోటీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డితో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సన్మానించారు. కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు మండిపల్లి కుటుంబానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి మంత్రి పదవి నారాచంద్రబాబునాయుడు అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన తంబళ్లపల్లె టీడీపీ బీసీ నేతలు

కురబలకోట, జూన్ 27: ఏపీ రవాణా, క్రీడా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ బీసీ నేతలు గురువారం కలిశారు. పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు వి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో రెడ్డెప్ప, ఆనంద్, రెడ్డి తదితరులు కలిశారు. జిల్లాలో నెలకొన్న బీసీల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళాడు. అలాగే జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి సత్యకుమార్‌ని కలిసిన జీవీఐసీ కరస్పాండెంట్


మంత్రి సత్యని కలిసిన జీవీఐసీ కరస్పాండెంట్ రమణారెడ్డి

కురబలకోట, జూన్ 14: మండలంలోని అంగళ్లు సమీపంలోని జీవీఐసీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ను విజయవాడలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా నియోజకవర్గాలలో నెలకొన్న పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో పర్యటించాలని మంత్రిని కోరగా సానుకూలకంగా స్పందించి త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

పెద్దతిప్పసముద్రం జూన్ 27 : అనారోగ్యంతో ఓ ఆశా కార్యకర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పీటీఎం మండలంలో చోటు చేసుకుంది. పీటీఎం మండలం అంకిరెడ్డిపల్లె పంచాయతీ కొండయ్యగారిపల్లెకు చెందిన సత్యనారాయణ భార్య వెంకటేశ్వరమ్మ (40) పీటీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో 2006 వ సంవత్సరం నుంచి ఆశా కార్యకర్తగా విధులు నిర్వర్తించేది. కాగా ఇటీవల వెంకటేశ్వరమ్మకు 3 నెలల నుంచి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అనంతపురం జిల్లా బత్తలపల్లె సమీపంలో ఉన్న ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకుంది. అయితే గత వారం రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు అనంతపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ఆమె పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వెంకటేశ్వరమ్మ మృతదేహాన్ని గురువారం తమ స్వగ్రామమైన కొండయ్యగారిపల్లెకు తీసుకొచ్చారు. విషయాన్ని తెలుసుకున్న తోటి వైద్య సిబ్బంది డాక్టర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు కొండయ్యగారిపల్లెకు చేరుకుని ఆమె భౌతిక కాయానికి పూల మాలలు వేసి కన్నీటి పర్యంతమయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించండి


సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె/పెద్దమండ్యం, జూన్ 27: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు కృషి చేయాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యో గులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం 164 స్థానాలు సా ధించి అధికారంలోకి వచ్చిందంటే ముఖ్య పాత్ర ప్రభుత్వ ఉద్యోగులదే అన్నారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచి, దాంతో పాటుగా గడిచిన మూడు నెలలు పెండింగ్‌లో ఉన్న రూ.3వేలు(నెలకు రూ.వె య్యి) జోడించి జూలై 1వ తేదీన రూ.7వేలు పింఛన్‌ను ఇంటి వద్దకే వచ్చి అందించబో తోందన్నారు. ఈ పింఛన్ పండుగ కార్యక్రమాన్ని ప్రతి సచివాలయ పరిధిలో అధికారులు స్థానిక టీడీపీ నాయకుల భాగస్వామ్యంతో చేపట్టాలన్నారు. అదేవిధంగా అనర్హులుగా ఉండి పింఛన్ తీసుకుంటున్న వారిని, అన్ని అర్హతలు ఉండి పింఛన్ అందుకోలేకపోతున్న వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో కృష్ణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, టీఎంఆర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, ఉత్తమ్‌రెడ్డి, సోముశేఖర్, తెలుగుయు వత నాయకులు గంగరాజు, నరసింహులు, సాంబశివ, మ్యూజికల్‌శివ, లక్ష్మీనారాయణనా యుడు, కాలానారాయణ, వీరాంజినేయులు, వెంకటరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తం, కోటకొండ రెడ్డప్ప, మదన, గురుమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దమండ్యం తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీవో వెంకటరమణయ్య, ఏపీవో మురళి, ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి, కూటమి నేతలు చల్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి, సిద్దవ రం ప్రసాద్, దత్తాత్రేయరెడ్డి, కుంటకింద పల్లి చంద్రారెడ్డి గల్లా నారాయణ, గంగాధర, మేకల చలపతి, విశ్వనాధరెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర, రామాంజులునాయుడు, సయ్యద్ షావలి, కాలేషా, ఆనంద, సాంబ, శేషాద్రి, మోహన, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు తక్షణం వేతనాలు చెల్లించాలి


సబ్‌కలెక్టరేట్ డీఏవో శ్రీనివాసులకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె టౌన్, జూన్ 27: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న 30 నెలల వేతనాలను తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో శ్రీనివాసులును కలసిన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు రూ6వేల నుంచి రూ.10వేలకు వేతనాలు పెంచు తూ విడుదల చేసిన జీవో 680 ప్రకారం 15వ ఫైనాన్స్ నుంచి వేతనాలు ఇస్తామని చె ప్పారన్నారు. కాని 30 నెలలు గడుస్తున్నా కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో పాటు కార్మికులకు పనిభద్రత కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, తిరుమల, వేణు గోపాల్‌రెడ్డి, సలీంబాషా, నరసింహులు, శ్రీనివాసులు, మౌలాలి పాల్గొన్నారు.

ఏపీ హంసా తాలుకా నూతన కార్యవర్గం ఎంపిక

పీలేరు, జూన్ 27: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంసా) పీలేరు తాలూకా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్ని కైంది. పీలేరులోని ఏరియా ఆసుపత్రిలో చి త్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వ ర్యంలో జరిగిన ఎన్నికల్లో పీలేరు తా లూకా అధ్యక్షుడుగా తలపుల పీహెచ్‌సీ హెచ్‌ఈ కొండయ్య, తలపుల పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసులు, ఎర్రకోట పల్లె పీహెచ్‌సీ స్టాఫ్ నర్సు భారతమ్మ, పీలేరు ఏరియా ఆసుపత్రి హెడ్ నర్సు శారద ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పీలేరు ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ నజీబ్ జాన్ అసోసియేట్ అధ్యక్షుడిగా, పీలేరు ఏరియా ఆసు పత్రి ఎంపీహెచ్ఎస్ బి.మో హన్ కార్యదర్శిగా, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ నవీన్ కోశాధికారిగా ఎన్ని కయ్యారు. మహిళా కార్యదర్శిగా ఎస్.వాణి, సంయుక్త కార్యదర్శిగా కిరణ్మయి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా ప్రమీలా కుమారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కార్యదర్శి టాటా బాయ్, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, ఎన్నికల అధికారిగా గీతారాణి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి బంగారు పతకం బహూకరణ

పీలేరు, జూన్ 27: పీలేరు జడ్పీ బాలి కోన్నత పాఠశాల విద్యార్థిని ఖాద్రి లక్ష్మీప్రసన్నకు ఆ పాఠశాల రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ బంగారు పతకం బహూకరించారు. పీలేరు అయ్యప్ప రెడ్డి కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా 23 ఏళ్ల సేవలందిం చిన పద్మావతమ్మ తాను పదవీ విరమ ణ చేసినప్పటి నుంచి అదే పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బంగారు పతకాలు బహూకరిస్తున్నారు. ఈ క్రమంలో 2022-23 విద్యాసం వత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని ఖాద్రి లక్ష్మీప్రసన్నకు గురువారం బంగారు పతకం బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఫౌజియా బేగం, బోధన, బోధేనేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఖాద్రి ప్రసన్నలక్ష్మికి బంగారు పతకం అందజేస్తున్న హెచ్‌ఎం ఫౌజియా బేగం

రేపు పంచాయతీ వారపు సంతకు బహిరంగ వేలం

వాల్మీకిపురం, జూన్ 27: వాల్మీకిపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 29న (శనివారం) మధ్యాహ్నం 3గంటలకు వారపు సంతకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో టి. ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్ (ఆర్టీసీ బస్టాండ్ మినహా), జంతువధశాలలకు సంబంధించి 2024-25సంవత్సరానికి గాను అనగా ఈ జూలై 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు రుసుము వసూళ్లు చేసుకొనుటకు గాను వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలలో పాల్గొనదలచిన వారు ముందస్తు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

మిట్స్‌లో కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

కురబలకోట, జూన్ 27: మండలంలోని అం గళ్లు సమీపంలో గల మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం మిట్స్ ఎన్ఎస్ఎస్, అగర్వాల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో డైరెక్టర్ ద్వారకనాథ్ మాట్లాడుతూ కంటి సమ స్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నా రు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 100 మందికి పైగా చికిత్సలు చేశారు. ఈ కార్యక్ర మంలో డీన్ తులసీరామ్‌నాయుడు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది

కలకడ, జూన్ 27: బీసీజీ టీకాతో వ్యక్తుల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రకో టపల్లె, కదిరాయచెరువు, దిగువపాలెం, దొడ్డిపల్లె, దేవలపల్లె గ్రామాల్లో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసి తగు సూచన లిచ్చారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలకు భారతప్రభుత్వం ఈ టీకాను ప్రవేశపెట్టిందన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్న, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

అడ్డుకోబోయిన యువకుడి గొంతకోసి పరార్



నిమ్మనపల్లి, జూన్ 27: నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి పంచాయతి దివిటివారిపల్లి సమీపంలో గురువారం రాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు దివిటివారిపల్లి సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓమహిళను అతి కిరాతకంగా నరికి చంపారు. అదే సమయం దివిటివారిపల్లికి చెందిన రామాంజులు(27) పొలం వద్దకు వెళుతున్న వారిని అక్కడ జరుగుతున్న దానిని చూసి అడ్డుకోబోయాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు రామాంజులపై కత్తిలో దాడి చేసి గొంతు కోసి అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పరారయ్యారు. ప్రాణాపాయ స్థితిలో వున్న రామాంజులను గ్రామస్థులు గమనించి మదనపల్లి ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే రాయాంజులకు అప్పటికే కోమాలోకి వెళ్లినట్లు డాక్టర్లు తెలిపారు. రామాంజులు మెలు కువస్తేగాని చనిపోయిన మహిళ ఎవరు, గుర్తుతెలియని వ్యక్తులు ఎవరు అనే విషయం బయటకు రానుంది దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.